




# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

PUBLISHED: RANGAREDDY | సంపుటి: 10 | సంచిక: 21 | సోమవారం, 02 ఫిబ్రవరి, 2026 | ఎడిటర్: బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు: 5 | వెల: 3/-


# బాగు బడ్జెట్

## అందరి కోసం సుందర స్వప్నం

### ఉత్పాదకతను, పోటీ తత్వాన్ని పెంచడం, సామర్థ్యాల పెంపు, సమ్మిళితవృద్ధి



మొత్తం పెట్టుబడి : రూ.53.5 లక్షల కోట్లు

పెట్టుబడి వ్యయం : రూ. 12.2 లక్షల కోట్లు

ద్రవ్య లోటు లక్ష్యం : జిడిపిలో 4.4 శాతం

రక్షణ వ్యయం : రూ. 5.95 లక్షల కోట్లు(రక్షణ సర్వీసుల కోసం రూ. 4.92 కోట్లు)

ఆరోగ్యం : రూ. 1.06 లక్షల కోట్లు

: తయారీ, ఉత్పత్తి రంగాలు, మౌలిక సదుపాయాలు, ఉద్యోగ సృష్టి, సరళమైన పన్ను, కస్టమ్స్ విధానాన్ని ప్రతిపాదించడం, ప్రభుత్వ ఆధునీకరణను రిఫార్మ్ ఎక్స్‌ప్రెస్‌గా ప్రశంసిస్తూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కేంద్ర బడ్జెట్ 2026-27ను ఆదివారం పార్లమెంటులో ప్రవేశపెట్టారు. వరుసగా తొమ్మిదవ సారి పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్ తాత్కాలిక తాయిలాలను ప్రజలకు అందించకుండా దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని తన విధానాలను ప్రకటించారు. ఈ బడ్జెట్ ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడం, కొనసాగించడం, ప్రజల సామర్థ్యాలను పెంపొందించడం ద్వారా వారి ఆకాంక్షలను నెరవేర్చడం, ప్రభుత్వ 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' దార్శనికతకు అనుగుణంగా వనరులకు సమ్మిళిత ప్రాప్యతను నిర్ధారించడం అనే మూడు కీలక కర్తవ్యాల చుట్టూ అల్లుకొని ఉంది. ఉత్పత్తి, మౌలిక సదుపాయాలు, నైపుణ్యాలు, ఎఐ, పన్ను, కస్టమ్స్ సుంకానికి సంబంధించి బడ్జెట్ 2026లోని కీలకాంశాలు–

> **ఆదాయపు పన్ను**
>
> *ప్రభుత్వం ఉన్న విధానాన్ని కొనసాగించాలని ఎంచుకోవడంతో ఈ ఏడాది నికరాదాయ వర్గాలకు కొత్త పన్ను ఊరట ఏమీ లేదు. బడ్జెట్‌లో పాత పన్ను విధానాన్నే కొనసాగించారు, దీని ప్రకారం సంవత్సరానికి రూ. 12 లక్షల వరకు ఆదాయంపై పన్ను ఉండదు. రూ. 75,000 ప్రామాణిక తగ్గింపును జోడిస్తే, పన్ను రహిత ఆదాయం రూ. 12,75,000కు పెరుగుతుంది. ఈ సంవత్సరం పన్ను శ్లాబులలో ఎలాంటి కొత్త మార్పు లేదు.*
>
> **చౌక అయిన ఔషధ ఉత్పత్తులు**
>
> *దాదాపు 17 క్యాన్సర్ మందులు డ్యూటీ మినహాయింపు కారణంగా చౌక కానున్నాయి. దీనితోపాటుగా, ఏడు అరుదైన వ్యాధులకు మందులను ఎటువంటి డ్యూటీ లేకుండా వ్యక్తి గతంగా దిగుమతి చేసుకునేందుకు అనుమతించనున్నారు. చౌకైన ఉత్పత్తుల జాబితాలో మైక్రోవేవ్ ఓవెన్లు, టీవీ పరికరాలు, తోలు వస్తువులు, పాదరక్షల తయారీలో ఉపయోగించే కీలక మైన, అధిక వ్యయంతో కూడిన భాగాలు కూడా ఉన్నాయి.*

**సంక్షేమ బిల్లులో 4.5 శాతం కోత**

**ఉత్పత్తి రంగానికి ప్రోత్సాహం**

భారతదేశంలో ఉత్పత్తి రంగంపై బడ్జెట్ 2026 ప్రత్యేక దీష్టి పెట్టింది. ఎలక్ట్రానిక్స్ భాగాల తయారీకి అయ్యే ఖర్చును రూ.40,000 కోట్లకు పెంచారు, అరుదైన ఎర్త్ మాగ్నెట్లు, రసాయన పార్కులు, కంటైనర్ తయారీ కోసం రూపొందించిన నూతన పథకాలు దిగుమతి పై ఆధారపడటాన్ని తగ్గించడానికి , దేశీయ సరఫరా లంకెలను బలోపేతం చేయడానికి ప్రయత్నిస్తాయి. జౌళి పరిశ్రమకు ఫైబర్స్, క్లస్టర్లు, నైపుణ్యం, స్థిరత్వం వంటి అంశాలను ఆవరించే సమగ్ర, ఉపాధి ఆధారిత ప్యాకేజీ లభించింది.


- 7 హై-స్పీడ్ రైలు కారిడార్లు, ఒక ప్రత్యేక సరుకు
- రవాణా కారిడార్ సహా 20 కొత్త జాతీయ జలమార్గాలకు ప్రతిపాదనలు
- ప్రైవేట్ డెవలపర్ల విశ్వాసం పెంపొందించేందుకు మౌలిక సదుపాయాల రిస్క్ గ్యారంటీ ఫండ్
- స్వదేశీ సీప్లేన్ తయారీ ప్రోత్సహానికి సీప్లేన్ వీజీఎఫ్ పథకం
- అరుదైన అయస్కాంత ఖనిజాల అన్వేషణ కోసం ఒడిశా, కేరళ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలలో ప్రత్యేక కారిడార్ల ఏర్పాటు

| ప్రియం | చౌక |
|---|---|
| సిగరెట్లు | ఎలక్ట్రానిక్స్ |
| మద్యం | మందులు |
| వాచీలు | క్రీడా పరికరాలు |
| బొగ్గు | విదేశీ విద్య |
| ఖనిజాలు | ఈవీ బ్యాటరీలు |

**మౌలిక సదుపాయాల ఆధారిత వృద్ధి**

అధిక మూలధన పెట్టుబడులతో మౌలిక సదుపాయాలకు ప్రోత్సాహించగా, ప్రైవేటు డెవలపర్ల కోసం ప్రాజెక్టులలోని నష్టాన్ని తగ్గించడానికి రిస్క్ గ్యారెంటీ ఫండ్ వంటి కార్యక్రమాలు వరకు, ప్రత్యేక సరుకు రవాణా కారిడార్లు, జాతీయ జలమార్గాలు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల (సీపీఎస్ఈల) ముఖ్యమైన స్థిరాస్తి ఆస్తుల పునర్వినియోగం కోసం, ఒక సీప్లేన్ విజిఎఫ్ (సాధ్యత అంతర నిధుల) పథకం కోసం ప్రత్యేక ఆర్ఇ

మిగతా 2లో



**మానవీయం ప్రధాని మోడీ**



**అంధ బడ్జెట్ రాహుల్ గాంధీ**

# సౌమ్య కుటుంబానికి రూ. కోటి

## తమ్ముడికి ప్రభుత్వ ఉద్యోగం

### గాంధీ ఆసుపత్రిలో మంత్రి జూపల్లి నివాళి



విధి నిర్వహణలో అసాధారణ తెగువ ప్రదర్శించి చనిపోయిన నిజామాబాద్ కు చెందిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో సౌమ్య భౌతికకాయానికి మంత్రి జూపల్లి కృష్ణారావు నివాళులర్పించారు. అనంతరం సౌమ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. సౌమ్య లేని లోటు భర్తీ చేయలేనిదని, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. సౌమ్య కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ.కోటి ఎక్స్‌గ్రేషియాతో పాటు సౌమ్య తమ్ముడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు. సౌమ్య సర్వీస్ కాలం అంటే రిటైర్మెంట్ వయసు వరకూ వేతనం చెల్లిస్తామని ప్రకటించారు. విధి నిర్వహణలో ఆమె చూపిన తెగువ, నిబద్ధత స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఎక్సైజ్ శాఖ ఉద్యోగులు ఒక్క రోజు వేతనాన్ని సౌమ్య కుటుంబ సభ్యులకు ఇవ్వాలని నిర్ణయం తీసుకొని, తమ సహచరిని కుటుంబానికి అండగా నిలవడం అభినందనీయం అని అన్నారు. అలాగే ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది భద్రత ప్రభుత్వ కర్తవ్యమని చెప్పారు,. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎక్సైజ్ శాఖ ఉద్యోగుల జోలికి వచ్చే దుండగుల వెన్ను వణికించేలా అత్యంత కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు.

మిగతా 2లో

# 4 గం. పైగా విచారణ

## ఆ పెద్దాయన మీరేనా? ప్రశ్నించిన సిట్

- ఏడుగురు పోలీస్ అధికారులిచ్చిన సమాచారమే కీలకంగా దర్యాప్తు
- ఫోన్ ట్యాపింగ్ ఆదేశాలు మీరే ఇచ్చారా..?
- ఆ పరికరాలు ఎక్కడి నుంచి తెప్పించారు.?
- కేసీఆర్ సమాధానాల లీక్ ఇవ్వని సిట్..?
- త్వరలోనే హైకోర్టుకు సిట్ నివేదిక
- విచారణలో భావోద్వేగానికిలోనైన మాజీ సీఎం
- బీఆర్ఎస్ ఆందోళనలతో అట్టుడికిన హైదరాబాద్
- పోలీసుల అదుపులో బీఆర్ఎస్వీ నాయకులు

ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ సిఎం కెసిఆర్ సిట్ విచారణ ముగిసింది. హైదరాబాద్ లోని నందినగర్ లో ఉన్న నివాసంలో రెండవ అంతస్తులోని ఓ గదిలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు సిట్ విచారణ ప్రారంభమవ్వగా.. నాలుగు గంటల 50 నిమిషాల పాటు సిట్ అధికారులు కేసీఆర్ ను విచారించారు. ఈ కేసులో ఇప్పటికే పలువురు అధికారులతో పాటు బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నేతలు, కేసీఆర్ కుటుంబ సభ్యులైన కేటీఆర్, హరీశ్ రావు, సంతోశ్ రావును సిట్ ప్రశ్నించింది. వీరిలో ఏడుగురు పోలీస్ అధికారులు ఇచ్చిన సమాచారంతోనే కేసీఆర్‌ను ప్రశ్నించినట్లు సమాచారం. ఈ క్రమంలో అధికారులు, పార్టీ నేతలు ఇచ్చిన స్టేట్ మెంట్ ఆధారంగా కేసీఆర్‌ను సిట్ అధికారులు ప్రశ్నించారు. ముఖ్యంగా ఫోన్ ట్యాపింగ్ ఆదేశాల వెనుక ఉన్నది ఎవరు? ప్రభాకర్ రావు నియామకం విషయంలో మీ పాత్ర ఏంటి అనే అంశాలపై సిట్ ప్రశ్నల వర్షం కురిపించింది. 'పెద్దాయన' ఆదేశాల మేరకే ఫోన్ ట్యాపింగ్ చేశామని పలువురు అధికారులు విచారణలో చెప్పడంతో ఆ పెద్దాయన మీరేనా? మీ ఆదేశాల మేరకు ఫోన్ ట్యాపింగ్ జరిగిందా? ఫోన్ ట్యాపింగ్ లో మీ ప్రమేయం ఏంటి అనే కోణంలో సిట్ అధికారులు ప్రశ్నలు సంధించినట్లు తెలుస్తోంది. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి వినియోగించిన పరికరాలు ఎక్కడి నుంచి వచ్చాయి..? ఎవరి ఆదేశాల మేరకు ఇవి పనిచేశాయి..? అన్న అంశాలపై సిట్ దృష్టి సారించింది. విచారణ ఎదుర్కొన్న అధికారులు..

మిగతా 2లో



నందినగర్‌లోని తన నివాసం వద్ద అభిమానులకు అభివాదం చేస్తున్న కెసిఆర్

## ఉద్యోగులకు పెండింగ్ బిల్లులు విడుదల

- రూ.720 కోట్లు రిలీజ్ చేసిన ప్రభుత్వం

ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలను రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వస్తోంది. ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపులకు గ్రీన్ ఛానల్ లో పెండింగ్ నిధులను నెలవారీగా విడుదల చేస్తూ వస్తుంది. తాజాగా ఆదివారం ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బిల్లుల కోసం రూ. 720 కోట్లు విడుదల చేసింది. జనవరి మాసానికి సంబంధించిన పెండింగ్ బిల్లులు రూ. 720 కోట్లు విడుదల చేశారు. గత ప్రభుత్వానికి ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బకా టయిలకు సంబంధించి ప్రతి నెల రూ.700 కోట్లకుపైగా నిధులు

మిగతా 2లో

# పనుల్లో నిర్లక్ష్యం వద్దు

- ప్రభుత్వం చేతికి హెలిబోర్న్ సర్వే నివేదిక
- భద్రత ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి
- ఎస్.ఎల్.బి.సి పునరుద్ధరణ పనుల సమీక్షలో మంత్రి ఉత్తమ్



రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్.ఎల్.బి.సి నిర్మాణం పనుల్లో జాప్యాన్ని ఉపేక్షించేది లేదని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. సొరంగం మార్గం పనులను నిరం తరం కొనసాగించి త్వరితగతిన పూర్తి చేసేం దుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామన్నారు. సొరంగ నిర్మాణ పనులలో ప్రమాదా లు పునరావృతం కాకుండా ఉండేందుకు భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు. దని ఆయన వివరించారు. అర్ధాంతరంగా నిలిచిపోయిన ఎస్.ఎల్.బి.సి పనుల పునరుద్ధరణ కోసం చేపట్టిన హెలి-బోర్న్ సర్వే నివేదిక ప్రభుత్వానికి చేరిందని తెలిపారు. శ్రీశైలం ఎడమగట్టు కాలువతో పాటు కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో అంతర్భాగమైన మేడిగడ్డ, సుందిళ్ళ,అన్నారం బ్యారేజ్ ల పునరుద్ధరణ

మిగతా 2లో

## కేంద్ర బడ్జెట్ వల్ల తెలంగాణకు మేలు

### కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

దేశ ఆర్థిక వ్యవస్థను స్థిరంగా ముందుకు తీసుకెళ్లేలా కేంద్ర సర్కార్ బడ్జెట్ కు రూపకల్పన చేసిందనికేంద్రమంత్రి కిషన్ రెడ్డి



వెల్లడించారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు ఆశాజనకంగా ఉందన్నారు. గతేడాది కంటే ఈసారి బడ్జెట్ పెరిగిందన్న ఆయన ఇందులో తెలంగాణకూ ప్రయోజనాలు చేకూరాయన్నారు. ఆదివారం న్యూఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్రం పెంచిన ఎరువుల రాయితీతో తెలంగాణ రైతులు లబ్ధి పొందుతారన్నారు. కాకతీయ టెక్స్ టైల్ పార్క్ కు లబ్ధి కలిగే పథకాన్ని కేంద్రం తీసుకువచ్చిందన్నారు. దేశవ్యాప్తంగా ప్రతి జిల్లాలో ఒక బాలికల హాస్టల్ ను కేంద్ర ఏర్పాటు చేయనుందనీ ఈ క్రమంలో రాష్ట్రంలో 33 జిల్లాలకు బాలికల హాస్టళ్లు మంజూరు అవుతాయన్నారు. రైల్వే బడ్జెట్ ను రూ. 2.77 లక్షల కోట్లకు పెంచిందన్నారు.

మిగతా 2లో

# బడ్జెట్‌లో రాష్ట్రానికి శూన్యం

- తెలంగాణ అభివృద్ధిని అడ్డుకునే కుట్ర
- నిధుల కొసం ఎన్నోసార్లు పీఎం, కేంద్రమంత్రులను కలిశాం
- ఒక్క విన్నపాన్నీ పరిగణలోకి తీసుకోలేదు
- కేంద్రం 2047 లక్ష్య సాధనలో భాగస్వాములం కాలేం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. రాష్ట్ర అభివృద్ధి కోసం సీఎం రేవంత్ రెడ్డితో కలిసి తామంతా ఢిల్లీ వెళ్లి ప్రధానిని, కేంద్ర ఆర్థిక మంత్రిని పలుమార్లు కలిసి విన్నవించినప్పటికీ, ఒక్క విన్నపాన్ని కూడా కేంద్రం పరిగణనలోకి తీసుకోకపోవడం దారుణమని ఆయన ధ్వజమెత్తారు. బడ్జెట్ లో తెలంగాణకు మొండి చేయ్యి చూపడానికి కారణమేంటనీ ప్రశ్నించారు. తెలంగాణ ఏం తప్పు చేసిందంటూ నిలదీశారు. ఆదివారం హైదరాబాద్ లోని ప్రజాభవన్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర భవిష్యత్తుకు కీలకమైన రీజినల్ రింగ్ రోడ్, మెట్రో విస్తరణ, , మూసీ ప్రక్షాళన ప్రాజెక్టుల కోసం కేంద్రం నుండి భారీగా నిధులు అందుతాయని ఆశించామన్నారు. మూసీ పునరుజ్జీవం కోసం కేంద్ర సాయం కోరినప్పటికీ బడ్జెట్‌లో దాని ఊసే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ ప్రపంచానికే ఫార్మా హబ్‌గా ఉన్నప్పటికీ, కేంద్రం ప్రకటించిన కెమికల్ పార్కుల జాబితాలో తెలంగాణకు చోటు కల్పించకపోవడంపై ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. గతంలో కాంగ్రెస్ హయాంలో ఈసీఐఎల్ వంటి దిగ్గజ సంస్థలను హైదరాబాద్‌కు తెచ్చామన్న ఆయన ప్రస్తుత ప్రభుత్వం ఉన్నవాటిని కూడా పట్టించుకోవడం లేదని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రతిష్టాత్మకంగా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసిందన్నారు. కేంద్రం ఈ విభాగంలోనూ రాష్ట్రానికి మొండిచేయి చూపిందని భట్టి విమర్శించారు. అఫోర్డబుల్ స్పోర్ట్స్ గూడ్స్ గురించి విజన్ డాక్యుమెంట్‌లో తెలంగాణ గురించి ప్రముఖంగా చెప్పినా, బడ్జెట్ కేటాయింపుల్లో అది ఎక్కడా కనిపించలేదన్నారు. హైదరాబాద్ సెంట్రిక్‌గా ఉండాల్సిన 'ఆరెంజ్ ఎకానమీ'ని కూడా

మిగతా 2లో



## హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ తొలి ఏఐ సదస్సుకు ఆహ్వానం పొందిన ఏకైక సిఎం రేవంత్

సీఎం రేవంత్ రెడ్డి కి అరుదైన గౌరవం లభించింది. హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ నిర్వహించే ఏఐ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించాలని ఆయనకు ఆహ్వానం అందింది.

మిగతా 2లో

# బడ్జెట్‌లో రాష్ట్రానికి శూన్యం

మొదటి పేజీ తరువాయి

బాంబేకి తరలించడం రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయానికి పరాకాష్ట అని ఆయన పేర్కొన్నారు. రామప్ప వంటి ప్రపంచ వారసత్వ కట్టడాలు, కృష్ణా-గోదావరి నదుల తీరంలో అద్భుతమైన దేవాలయాలు, అటవీ సంపద ఉన్నా తెలంగాణ టూరిజాన్ని కేంద్రం పూర్తిగా విస్మరించిందని భట్టి ఆరోపించారు. రీజినల్ మెడికల్ హబ్ ప్రకటించినా అందులో తెలంగాణ పేరు లేదని, సెమీ కండక్టర్ల విషయంలో కేవలం 'పరిశీలిస్తాం' అన్న మాటే తప్ప స్పష్టమైన ప్రకటన లేదని మండిపడ్డారు. కేంద్రం 2047 లక్ష్య సాధనలో తాము కూడా భాగస్వామ్యం కావాలని అనుకున్నామన్నారు. కానీ కేంద్రం తెలంగాణను నిర్లక్ష్యం చేయడంతో అది సాధ్యం కాదని ఆయన అన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని జాబితా నుండి తొలగించే ప్రయత్నం చేస్తూ, పేదల సంక్షేమానికి కేంద్రం తూట్లు పొడుస్తోందని విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా ఎంపీలందరూ కలిసి కేంద్రంపై ఒత్తిడి తీసుకువద్దామని భట్టి పిలుపునిచ్చారు. తాము బాధ్యతగా కేంద్రాన్ని కలుస్తూనే ఉంటామన్న ఆయన రాష్ట్ర ప్రయోజనాల కోసం రాజకీయాలకు అతీతంగా పోరాటం చేస్తామని చెప్పారు.

## కేంద్ర బడ్జెట్ వల్ల తెలంగాణకు మేలు

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రానికి మూడు హైస్పీడ్ రైళ్లు రానున్నాయని కిషన్ రెడ్డి తెలిపారు. డేటా సెంటర్లకు ఇచ్చే ప్రోత్సాహంతో తెలంగాణకు లాభం జరుగుతుందన్నారు. విదేశీ విద్యపై పన్ను తగ్గించడంతో తెలుగు విద్యార్థులకు ఎంతో మేలు జరగనుందన్నారు.

**బడ్జెట్ పై అవగాహన లేకే..** మెట్రో రైలు గురించి ప్రత్యేకంగా బడ్జెట్ లో ఉండదని కిషన్ రెడ్డి అన్నారు. ఇది అర్బన్ డెవలప్ మెంట్ మినిస్ట్రీస్ ఇస్తుంటుందని వివరించారు. మెట్రోపై డీపీఆర్ ఇస్తే పట్టణాభివృద్ధి శాఖ నిధులు ఇస్తుందన్నారు. ఆ మాత్రం అవగాహన లేకుండా మాట్లాడితే ఎలా అని విపక్ష నేతలను ప్రశ్నించారు. బడ్జెట్‌లో లేకుండానే కేబినెట్ ఆమోదంతో అనేక రాష్ట్రాలకు నిధులు ఇస్తుంటామన్నారు. హైదరాబాద్ మెట్రో ఎల్ అండ్ టీ నుంచి టేకోవర్ చేయాలన్న కిషన్ రెడ్డి... ఆ తర్వాత డీపీఆర్ సిద్ధం చేస్తే ప్రక్రియ మొదలవుతుందన్నారు. జీ రామ్ జీ గ్రామాభివృద్ధికి సంబంధించినవేనన్నారు. ఈ బడ్జెట్ ఉద్యోగ, ఉపాధి కేంద్రీకృతంగా రూపొందించారన్నారు. గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీలకు నిధులు పెరిగాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో అద్భుతంగా ప్రవేశపెట్టిన బడ్జెట్ ఇది అన్నారు. మార్కెట్ ఒడిదుడుకులు అన్ని సర్ధుకుంటాయని చెప్పారు.

**వాటాల కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్‌లో కొట్లాట:**

ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు రెండు సంవత్సరాలుగా సీరియల్ నడిపిస్తున్నారని కిషన్ రెడ్డి విమర్శించారు. తన ఫోన్ ట్యాప్ అయినట్లు తనకు ఎలాంటి నోటీసులు రాలేదన్నారు. ఇంటి అల్లుడి ఫోన్ నే కేసీఆర్ ట్యాప్ చేశాడని సొంత కూతురు కవితనే ఆరోపించిన విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణ హైకోర్టు జడ్జీల ఫోన్లు ట్యాప్ చేశారని పోలీసులు హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇంకెంత కాలం దర్యాప్తు కొనసాగిస్తారని ప్రశ్నించారు. ఈ కేసులోని ఆరోపణలు అత్యంత తీవ్రమైనవన్న ఆయన చట్టం తన పని తాను చేసుకోవాలన్నారు. ప్రజల దృష్టిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ విశ్వాసం కోల్పోయాయని ఈ రెండు పార్టీలకు ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. దోచుకున్న డబ్బుల్లో వాటా కోసం కేసీఆర్ కుటుంబం కొట్టుకుంటుంటే వాటాల కోసం కాంగ్రెస్ మంత్రులు కొట్టుకుంటున్నారని వ్యాఖ్యానించారు.

## సౌమ్య కుటుంబానికి రూ. కోటి

మొదటి పేజీ తరువాయి

ఎక్సైజ్ శాఖ అధికారులకు ఆయుధాలు ఇచ్చే నిర్ణయం తమ ప్రభుత్వ పరిశీలనలో ఉందన్న ఆయన త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. గంజాయి వంటి మాదకద్రవ్యాల ముఠాల విషయంలో మరింత కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఎక్సైజ్ శాఖ అధికారులతో కలిసి రెండు నిమిషాల మౌనం పాటించి, ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అదనపు కమిషనర్ ఖురేషి, ఎక్సైజ్ శాఖ అధికారుల సంఘం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

**అధికార లాంఛనాలతో అంత్యక్రియలు**

నిజామాబాద్ జిల్లా మోస్రా మండలానికి చెందిన సౌమ్య, జనవరి 23న మాధవనగర్ వద్ద గంజాయి తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకునే ప్రయత్నంలో స్మగ్లర్ల కారు కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. ఎనిమిది రోజుల పాటు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడిన ఆమె శనివారం రాత్రి 9:41 గంటలకు తుదిశ్వాస విడిచారు. విధి నిర్వాహణలో వీరోచితంగా వ్యవహరించిన సౌమ్య మృతిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. స్మగ్లర్ల దౌర్జన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధ్యులను వదిలిపెట్టవద్దని పోలీసు ఉన్నతాధికారులను సీఎం ఆదేశించారు. గాజుల సౌమ్య (23) భౌతిక కాయానికి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని సూచించారు. విధి నిర్వహణలో ఆమె చూపిన ధైర్యసాహసాలను కొనియాడిన సీఎం, ఈ మేరకు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిని ఆదేశించారు. కాగా సౌమ్య కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని ప్రభుత్వం భరోసా ఇచ్చింది.

**సెల్యూట్.. సౌమ్య : నగర సీపీ సజ్జనార్**

తన ప్రాణాలను పణంగా పెట్టి... స్మగ్లర్ల చేతిలో గాయపడి చికిత్సపొందుతూ గాజుల సౌమ్య మృతి చెందడం బాధాకరమని నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మత్తు రక్కసిని అంతం చేసేందుకు ఆమె చూపిన సాహసం వెలకట్టలేనిదని కొనియాడారు. రక్తమోడుతున్నా వెనకడుగు వేయకుండా పోరాడిన ఆమె త్యాగం నిరుపమానమని చెప్పారు. గంజాయి మాఫియా వాహనంతో తొక్కించి కిరాతకంగా చంపడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేస్తూ, సమాజ రక్షణ కో సం ప్రాణాలర్పించిన ఆ వీరనారి ధైర్యానికి మనస్ఫూర్తిగా నివాళులర్పించారు. ఈ ఘటన కేవలం ఒక విషాదం మాత్రమే కాదన్న సజ్జనార్... గంజాయి మాఫియా ఎంతలా పేట్రేగిపోతుందో చెప్పడానికి నిదర్శనమని పేర్కొన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాల ముప్పు సమాజానికి ఎంతటి ప్రమాదకరంగా మారిందో సౌమ్య మరణం హెచ్చరిస్తోందని ఆయన ఆదివారం ట్వీట్ చేశారు. విధి నిర్వహణలో అమరురులైన సౌమ్య కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## పాపాలకు మూల్యం చెల్లించుకోవాల్సిందే

**బీఆర్ఎస్ నేతలు ఫోన్ ట్యాపింగ్ లో రెడ్ హ్యాండెడ్ గా దొరికారు**

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**హైదరాబాద్, ఫిబ్రవరి1**

ఫోన్ ట్యాపింగ్ కేసులో రెడ్ హ్యాండెడ్ గా దొరికిన బీఆర్ఎస్ నేతలు సెంటిమెంట్‌తో ప్రజలను రెచ్చగొడుతున్నారని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆరోపించారు. రాజకీయ కక్ష సాధించాలనే ఉద్దేశం కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉంటే ఈ రెండేళ్లు మీరు రోడ్డు మీద తిరిగేవాళ్లు కాదని స్పష్టం చేశారు. కేసీఆర్ సిట్ విచారణపై బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళనలపై ఆయన స్పందించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు చేసిన పాపాలకు మూల్యం చెల్లించుకోవాల్సిందేనన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసు విషయంలో చట్టం తన పని తాను చేసుకంటూ పోతుందని స్పష్టం చేశారు. అసలు తప్పే చేయని బీఆర్ఎస్ నాయకులకు సిట్ విచారణ అంటే ఎందుకంత భయమని నిలదీశారు. గుమ్మడికాయ దొంగ అంటే భుజాలు తడుముకుంటున్నారని విమర్శించారు.

# బాగు బడ్జెట్

మొదటి పేజీ తరువాయి

ఐటిలు (రియల్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్టులు) పథకం వరకు అనేక ప్రాధాన్యతలను ఆర్థిక మంత్రి ప్రకటించారు. కేంద్ర మూలధన వ్యయం (కేపెక్స్) లక్ష్యాన్ని ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన రూ. 11.2 లక్షల కోట్ల నుంచి ఆర్థిక సంవత్సరం 2027కు రూ.12.2 లక్షల కోట్లకు పెంచారు. ఆర్థిక క్రమశిక్షణను అనుసరిస్తూ, విత్తలోటును 2026-27 స్థూలజాతీయ ఉత్పత్తిలో 4.3 శాతానికి తగ్గించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సూచించిన 4.4 శాతానికన్నా ఇది తక్కువ. సంస్కరణలతో ముడిపడిన నిధుల మద్దతుతో, టైర్-II, టైర్-III నగరాలను సిటీ ఎకనామిక్ రీజియన్ల ద్వారా పట్టణ వృద్ధికి కేంద్రంగా మార్చారు. వృద్ధి కేంద్రాలుగా విస్తరించిన దాదాపు ఐదు లక్షల జనాభా ఉన్న పట్టణాలు (టైర్ 2, టైర్ 3)లో మౌలిక సదుపాయాల అభివృద్ధిపై తమ దృష్టి కొనసాగుతుందని, తన బడ్జెట్ ఉపన్యాసంలో నిర్మల పేర్కొన్నారు. ఉపాధి ఇంజిన్‌గా సేవల ఆర్థిక వ్యవస్థకు బడ్జెట్ కొత్త ప్రాధాన్యతను ఇచ్చింది. అధిక సాంకేతికతతో కూడిన విద్య-నుండి-ఉపాధి, సంస్థ కమిటీ నైపుణ్యాలను మార్కెట్ అవసరాలకు అనుగుణంగా, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల ప్రభావంతో సమలేఖనం చేస్తుంది.పాఠశాలల్లో, కళాశాలల్లో ఏవిజిసి లాబ్‌ల ద్వారా కంటెంట్ సృష్టి, సృజనాత్మక పరిశ్రమలు ప్రోత్సాహం, యానిమేషన్, గేమింగ్, కామిక్స్, నమూనా, ఆతిథ్యం కోసం నూతన సంస్థాగత సామర్థ్యం, గైడ్ల నుంచి డిజిటల్ వారసత్వ నమోదు, డాక్యుమెంటేషన్ సహా నైపుణ్యాలతో లంకె కలిగిన పర్యాటకం అన్న విధానాలు, సంస్కృతిని, కంటెంట్‌ను ఉపాధిగా, ఎగుమతులుగా మార్చాలన్న లక్ష్యంగా పెట్టుకొని రూపొందించినట్టు భావించవచ్చు. దేశవ్యాప్తంగా ఉన్న మాధ్యమిక పాఠశాలలు, 500 కళాశాలల్లో ఏవిజిసి కంటెంట్ క్రియేటర్ లాబ్‌లను ఏర్పాటు చేసేందుకు ముంబైలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీస్‌కు తోడ్పాటునందించాలని ప్రతిపాదిస్తున్నానని ఆమె అన్నారు. ఏవిజిసి అంటే యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్.

**ఏఐ& సెమీకండక్టర్లకు ప్రోత్సాహం**

కృత్రిమ మేధస్సు (ఏఐ)ని ఒక స్వతంత్ర అంశంగా కాకుండా, వివిధ రంగాలలో శక్తిని పెంచే ఒక సాధనంగా పరిగణించారు. రైతులకు ఏఐ- ఆధారిత సలహా సాధనాల ప్రతిపాదనలు, విద్యా పాఠ్యాంశాల్లో, నైపుణ్యాల్లో, ఏఐ ఏకీకరణతో కూడిన పాలన, వ్యవసాయం, విద్య, నైపుణ్యాభివృద్ధిలో స్వీకరణను ప్రోత్సహించడం ద్వారా బడ్జెట్ కృత్రిమ మేధస్సు (ఏఐ) కు ప్రోత్సాహాన్ని అందించింది. హార్డ్‌వేర్ విషయంలో, ఐఎస్ఎం2.0 (ఇండియా సెమీ కండక్టర్ మిషన్ 2.0) కింద సెమీకండక్టర్ వ్యూహం నిర్ణయాత్మకంగా విస్తరించింది. దేశీయ పరికరాల తయారీ, ముడి పదార్థాలు, పరిశోధన కేంద్రాలు, మానవ వనరుల అభివృద్ధిపై దృష్టి సారించడం, భారతదేశంలో ఒక పటిష్టమైన చిప్ పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి దీర్ఘకాలిక నిబద్ధతను సూచిస్తుంది.

**పన్నుల విధానం, ఐటీఆర్, టిడిఎస్, టిసిఎస్**

ప్రధాన నిర్మాణాత్మక సంస్కరణ ఆదాయపు పన్ను చట్టం, 2025తో వస్తోంది. సరళమైన నియమాలు, పునఃరూపకల్పన చేసిన ఫార్మ్‌లతో ఏప్రిల్ 1, 2026 నుంచి ఇది అమలులోకి రానుంది. వ్యక్తులకు కంప్లయెన్స్ ఉపశమనాన్ని బడ్జెట్ 2026 అందించింది. వీటిలో ఇంతకు ముందు డిసెంబర్ 31గా ఉన్న తేదీని మార్చి 31 వరకు రిటర్న్‌లను సవరించడానికి పొడిగించిన గడువు, అస్థిరమైన ఐటీఆర్ గడువు తేదీలు కాక, డిపాజిటరీల ద్వారా ఫారమ్ 15జి/ 15 హెచ్ సులభమైన దాఖలు చేసుకునే అవకాశాలను బడ్జెట్ అందిస్తోంది.

ఐటిఆర్-1, ఐటిఆర్-2 రిటర్న్‌లు కలిగిన వ్యక్తులు జులై 31 వరకూ దాకలు చేయడాన్ని కొనసాగించవచ్చని, ఆడిట్‌లేని వ్యాపారాలు లేదా ట్రస్టులు ఆగస్టు 31వరకు దాఖలు చేయవచ్చు. మానవ వనరుల సేవల కోసం మూలం వద్ద పన్ను కోత (టిడిఎస్) నిబంధనలను స్పష్టం చేయగా, తక్కువ లేదా సున్నా టీడీఎస్ సర్టిఫికేట్ల కోసం నియమాల ఆధారిత వ్యవస్థను ప్రతిపాదించారు. సరళీకృత రెమిటెన్స్ పథకం (ఎల్ ఆర్ ఎస్) కింద విదేశీ టూర్ ప్యాకేజీలపై, విద్య, వైద్య ఖర్చులపై టిడిఎస్ రేట్లను 2 శాతానికి తగ్గించారు. సమగ్ర మదింపు, జరిమానా ఉత్తర్వులు, తక్కువ ముందస్తు డిపాజిట్ అవసరాలు, విస్తృతమైన ఇమ్యూనిటీ నిబంధనల ద్వారా లిటిగేషన్‌ను లక్ష్యంగా చేసుకున్నారు. విదేశాలలో ఉండే భారతీయుడు స్థిరాస్తిని అమ్మినప్పుడు చెల్లించవలసిన టీడీఎస్‌ను తగ్గించి, టిఎఎన్ (పన్ను మినహాయింపు, సేకరణ ఖాతా సంఖ్య) అవసరం లేకుండా దాని కొనుగోలుదారు పాన్ (శాశ్వత ఖాతా సంఖ్య) ఆధారిత చలాన్ ద్వారా జమ చేయబడుతుందని సీతారామన్ చెప్పారు.

**కస్టమ్స్ డ్యూటీలో సర్దుబాట్లు**

దేశీయ తయారీ, ఇంధన పరివర్తన, జీవన సౌలభ్యంపై స్పష్టమైన దృష్టితో కస్టమ్స్ సుంకాల హేతుబద్ధీకరణ కొనసాగింది. లిథియం-ఇయాన్ బ్యాటరీలు, కీలకమైన ఖనిజాల ప్రాసెసింగ్, అణు విద్యుత్ ప్రాజెక్టులు, విమానాల తయారీలో ఉపయోగించే మూలధన వస్తువులకు మినహాయింపులు పొడిగించారు లేదా ప్రవేశపెట్టారు. వ్యక్తిగత వినియోగం కోసం దిగుమతి చేసుకునే వస్తువులు 20 శాతం నుంచి 10 శాతానికి తగ్గనున్నాయి. పదిహేడు కాన్సర్ మందులు, అదనపు అరుదైన వ్యాధుల చికిత్సకు అవసరమైన మందులను కస్టమ్స్ డ్యూటీ నుంచి మినహాయించారు. ఎగుమతిదారులకు, ఎంఎస్ ఎంఇలకు విశ్వాసం ఆధారంగా, సాంకేతిక సాయంతో చేసే క్లియరెన్స్‌లు, కార్గో కదలిక, తక్కువ కంప్లయెన్స్ ఖర్చులను లక్ష్యంగా చేసుకున్న ప్రక్రియ సంస్కరణలు.

## ఉద్యోగులకు పెండింగ్ బిల్లులు విడుదల

మొదటి పేజీ తరువాయి

విడుదల చేస్తామని ఉద్యోగ సంఘాలకు ప్రభుత్వం హామీ ఇచ్చింది. గత సంవ త్సరం జూన్ నెలాఖరులో రూ.183 కోట్లు విడుదల చేసింది. ఆ తర్వాత గత సంవత్సరం ఆగస్టు నుంచి ప్రతి నెల కనీసంగా రూ. 700 కోట్ల చొప్పున విడుదల చేస్తూ వస్తోంది. తాజాగా విడుదల చేసిన నిధుల్లో 2022 నుంచి 2025 ఫిబ్రవరి వరకు సరెండర్ లీవుల ఎన్ క్యాష్ మనేటి పెండింగ్ మొత్తం ఒకేసారి క్లియర్ చేసింది. వీటితోపాటు విడుదలైన బిల్లులో గ్రాట్యుటీ, జిపిఎఫ్, సరెండర్ లీవ్ లు, అడ్వాన్సులు ఉన్నాయి.

## పనుల్లో నిర్లక్ష్యం వద్దు

మొదటి పేజీ తరువాయి

పనులపై ఆయన ఆదివారం సాయంత్రం హైదరాబాద్ లో నీటిపారుదల శాఖాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎస్.ఎల్.బి.సి సొరంగ మార్గం మిగిలిన భాగం పూర్తి చేయడానికి అవసరమైన నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సహకారంతో నిర్వహించిన ఏరియల్ ఎలాక్ట్రో మాగ్నెటిక్ సర్వే నివేదిక ప్రభుత్వానికి చేరిందని ఆయన తెలిపారు. సొరంగమార్గం పూర్తికి సర్వే ఆధారంగా రూపొందించిన నివేదిక దోహద పడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. భౌగోళికంగా ప్రతికూల పరిస్థితులు ఏర్పడితే ముందస్తుగా బందోబస్తు చర్యలు చేపట్టడానికి ఈ సర్వే ఉపకరిస్తుందని పేర్కొ న్నారు. సొరంగమార్గం పూర్తి చేసేందుకు ఆధునిక పరిజ్ఞానం వినియోగించడంతో పా టు శాస్త్రీయ పద్ధతిలో నిరంతరం అధికారుల పర్యవేక్షణలో పనులు కొనసాగేలా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు నిర్వహణకు ప్రత్యేకంగా డివిజన్ ఏర్పాటు చేయడంతో పాటు ఆపరేషన్ బృందానికి ప్రత్యేక చీఫ్ ఇంజనీర్ ను నియమించాలని ఆదేశించారు. నిర్మాణం జరుగుతున్న సమయంలో ఎప్పటికప్పుడు భద్రతా,నాణ్యత ప్రమాణాలను పాటించేలా చూడడంతో పాటు అధికారులు రూపొందించిన డిజైన్ ప్రకారం నిర్మాణం కొనసాగేందుకు వీలుగా ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించిన చీఫ్ ఇంజనీర్ కు సహకరించేలా ఉండేందుకు స్వతంత్ర పర్యవేక్షణ కన్సల్టెంట్ ను నియమించాలన్నారు. నిరంతరం పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ క్షేత్ర స్థాయిలో భాగస్వామ్యులు అవుతారని ఆయన చెప్పారు. సొరంగ మార్గంలో ఏర్పడుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు అంచనా వేసేందుకు ప్రత్యేక జియో టెక్నికల్,జియాలజికల్ బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. దీంతో పాటు కాళేశ్వరం బ్యారేజ్ ల పనుల పునరుద్ధరణ పనులు వేగవంతం కోసం అవసరమైన సాంకేతిక సంస్థలను,డిజైన్ కన్సల్టెంట్స్ సమన్వయం ఆవశ్యకత గురుంచి మంత్రి వివరించారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ నిర్వహించే పరీక్షల షెడ్యూల్ ,ప్రాజెక్ట డిజైనర్ల పనితో సమన్వయం ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పరస్పరం సమన్వయం చేసుకుంటూ పోతే కేంద్ర జల వనరుల సంఘం పరిధిలోని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నుండి డిజైన్ లకు దశలవారిగా అనుమతులు పొందడం సులభతరమౌతుందని ఆయన చెప్పారు . ఈ మేరకు ఫిబ్రవరి 16 తరువాత ఎన్.డి.ఎస్.ఏ నిపుణుల కమిటీ తో సమావేశం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పునరుద్ధరణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు అవసరమైన అనుమతులు పొంది పనులు వేగవంతం చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులకు సూచించారు.

## కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు అన్యాయం

**సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు**

రాష్ట్రానికి సంబంధించిన విభజన హామీలకు ఎలాంటి కేటాయిపులు, ప్రకటనలు చేయకుండా కేంద్ర బడ్జెట్ తీవ్ర నిరాశ పరిచిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు.



రాష్ట్రం ఏర్పడి 12 ఏండ్లు అవుతున్నా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ విభజన హామీలు స్టీల్ ఫ్యాక్టరీ, హైదరాబాద్‌కు మెట్రో, రీజినల్ రింగ్ రోడ్డు, రాష్ట్రంలో ఒక సాగునీటి ప్రాజెక్టు జాతీయ హోదా, కొత్తగూడెం ఎయిర్‌పోర్టుకు ప్రకటన డిమాండ్స్‌ను బడ్జెట్‌లో విస్మరించారని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న తక్షణ సమస్య నిరుద్యోగం, ఆర్థిక అంతరాలకు సంబంధించి ఏలాంటి పరిష్కారం చూపలేదని మండిపడ్డారు. ఈ బడ్జెట్ మధ్య తరగతి పేదలకు ఉపశమన ఇవ్వకపోగా, కార్పొరేట్స్‌కే అనుకూలంగా ఉన్నదని అన్నారు. మూలిగే నక్కపై తాటి పండులాగా ఇప్పటికే రుణాలు, ఆర్థిక భారాలతో సతమతమవుతున్న రాష్ట్రాలకు ఉపాధి హామీ పథకానికి పేరు మార్చి 'జిరామ్‌జి' పథకం ద్వారా రాష్ట్రాలకు 40 శాతం భారాన్ని వేయడం సరికాదన్నారు. 16వ ఆర్థిక సంఘం సిఫార్సు మేరకు కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు 41 శాతం వాటాను కేటాయించడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేంద్రం తమ పన్నుల్లో 50 శాతం రాష్ట్రాలకు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంపై కేంద్రం వివక్ష చూపడం పట్ల రాష్ట్రం నుంచి ఎన్నికైన కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు ప్రజలకు సమాధానం చెప్పాలని సాంబశివరావు డిమాండ్ చేశారు.

## హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ తొలి ఏఐ సదస్సుకు ఆహ్వానం పొందిన ఏకైక సిఎం రేవంత్

మొదటి పేజీ తరువాయి

ఈ సదస్సుకు భారత్ నుంచి సీఎం ఒక్కరికే ఆహ్వానం అందడం విశేషం. మరోవైపు అమెరికా పర్యటనలో భాగంగా హార్వర్డ్ యూనివర్సిటీలో తన చివరి రోజున సీఎం రేవంత్‌రెడ్డి వివిధ అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతో పాటు యూనివర్సిటీలోని పలు పాఠశాలల విద్యార్థులు, ఎంఐటీ, కొలంబియా వంటి ప్రముఖ విశ్వవిద్యాలయాల క్యాంపస్‌లకు చెందిన విద్యార్థులు, పూర్వవిద్యార్థులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా నాయకత్వం, విజయాల సాధన, ఆర్థికాభివృద్ధి, అభివృద్ధి నమూనాలు, స్థిరత్వం, పర్యావరణ పరిరక్షణ, రైతు సంక్షేమం, మహిళలు-యువత సాధికారత వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. కాగా నేడు తెల్లవారుజామున సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణకు రానున్నారు. హైదరాబాద్‌లో సీపీఐ ఆధ్వర్యంలో జరిగే తెలంగాణ అమరవీరుల సంస్మరణ కార్యక్రమానికి హాజరుకానున్న ఆయన.. మంత్రులు, పార్టీ ముఖ్యనేతలతో సమావేశం కానున్నారు. ఇందులో మున్సిపల్ ఎన్నికల సన్నద్ధత, పార్టీ బలాబలాలపై చర్చించనున్నట్లు సమాచారం.

## 4 గం. పైగా విచారణ

మొదటి పేజీ తరువాయి

పెద్దాయన చెబితేనే ఫోన్ ట్యాపింగ్ చేశామని సిట్ అధికారులకు వాంగ్మూలం ఇవ్వడంతో ఆ కుట్ర కోణం వెనుక ఉన్న ఆ పెద్దాయన మీరేనా? అని సిట్ అధికారులు కేసీఆర్ ను ప్రశ్నించినట్లు సమాచారం. ఈ మేరకు కేసీఆర్ స్టేట్ మెంట్ ను సిట్ అధికారులు రికార్డు చేసుకున్నారు. మాధాపూర్ డీసీపీ రీతిరాజ్, ఐపీఎస్ విజయ్ కుమార్, ఐపీఎస్ నారాయణరెడ్డి, అడిషనల్ ఎస్పీలు అరవింద్ కుమార్, కేఎస్ రావు కేసీఆర్ ను ప్రశ్నించారు. ఆయన చెప్పిన విషయాలన్నింటినీ సిట్ అధికారులు రికార్డు చేసుకున్నారు. విచారణ మొదలుకాకముందే సిట్ అధికారులు ఎలక్ట్రానిక్ పరికరాలతో కేసీఆర్ గదిని పూర్తిగా తనిఖీ చేశారు. విచారణ ప్రక్రియ మొత్తాన్ని వీడియోలో రికార్డ్ చేశారు. కేసీఆర్ వెంట మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు, సంతోష్ రావులను మాత్రమే ఇంట్లోకి అనుమతించారు. అయితే.. విచారణ జరుగుతున్న గదిలోకి ఎవరినీ.. కనీసం లాయర్‌ను కూడా అనుమతించలేదు. ఎర్రవల్లి నుంచి వస్తున్న సమయంలో భారీగా తరలివచ్చిన పార్టీ కార్యకర్తలను పోలీసులు మార్గమధ్యలో అడ్డుకుని.. కేవలం కేసీఆర్ వాహనాలను మాత్రమే అనుమతించారు. విచారణ కొనసాగుతుండగా.. ఆయన నివాసంలో కాస్త ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విచారణ ముగిసిన అనంతరం కేసీఆర్ మద్దతుదారుల వైపు చేయి ఊపుతూ లోపలికి వెళ్లారు. తదుపరి సిట్ అధికారులు ఈ వివరాలను కోర్టుకు సమర్పించనున్నారు. కాగా ఎర్రవల్లిలోని ఫామ్ హౌస్ నుంచి వచ్చిన కేసీఆర్ తన వెంట ఒక నోట్ బుక్, పలు డాక్యుమెంట్లు తెచ్చుకున్నారు. సిట్ అడిగే ప్రశ్నలను ఆయన నోట్ చేసుకున్నారు. ఇక తన వెంట తెచ్చిన డాక్యుమెంట్లలో ఏముందనేది ఎవరికీ తెలియరాలేదు. విచారణను సిట్ అధికారులు వీడియో రికార్డు చేశారు. ఆదివారం మధ్యాహ్నం 11 గంటల ప్రాంతంలో ఎర్రవల్లి ఫామ్ హౌస్ నుంచి కేసీఆర్ నందినగర్ నివాసానికి వచ్చిన కేసీఆర్ కు కేటీఆర్ స్వాగతం పలికారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు విచారణ ప్రారంభమైంది. విచారణకు ముందే కేసీఆర్ నివాసానికి చేరుకున్న సిట్ అధికారులు బిల్డింగ్ లోని రెండో అంతస్తులో ఒక గదిలో విచారణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. విచారణ సమయంలో కేసీఆర్ వెంట ఒకరు ఉండేందుకు అవకాశం కల్పించారు. దీంతో గులాబీ బాస్ వెంట మాజీ ఎంపీ సంతోష్ రావు ఉంటారని బీఆర్ఎస్ లీగల్ టీమ్ సిట్ కు సమాచారం అందజేసింది. ఇక విచారణ సమయంలో కుటుంబ సభ్యులైగా కేటీఆర్, హరీశ్ రావు ఇంట్లోనే ఉన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు అందరూ తెలంగాణ భవన్ లోనే ఉన్నారు. ఆ గదిలోనే విచారణ..

**ఉద్వేగానికి లోనైన కేసీఆర్..**

నందినగర్‌లోని ఆయన నివాసంలోని రెండో అంతస్తులో ఉన్న ప్రత్యేక గదిలో సిట్ అధికారులు కేసీఆర్ ను విచారించారు. ఈ క్రమంలో విచారణకు ముందు కేసీఆర్ భావోద్వేగానికి గురయ్యారు. రాష్ట్ర సాధన కోసం గత పదేళ్లుగా ఏ గదిలో వ్యూహాలు రచించానో.. ఏ గదిలో నిద్రలేని రాత్రులు గడిపి ఉద్యమానికి దిశానిర్దేశం చేశానో.. అదే గదిలో ఇప్పుడు నిందితుడిలా విచారణ ఎదుర్కోవడం బాధాకరమని ఆయన సన్నిహితుల దగ్గర ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. 'రాష్ట్రం కోసం పోరాడిన చోటే ఇలాంటి పరిస్థితులు వస్తాయని కలలో కూడా అనుకోలేదు' అని ఆయన ఆవేదనను వ్యక్తం చేశారు.

**అట్టుడికిన నగరం...**

ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ విచారణకు నిరసనగా బీఆర్ఎస్ నేతలు, బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నిరసనలకు దిగారు. హైదరాబాద్ లోని తెలంగాణ భవన్ కు భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. అక్కడి నుంచి సీఎం రేవంత్ నివాసాన్ని ముట్టడించేందుకు వెళ్తుండగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. బీఆర్ఎస్ శ్రేణులు ఏ క్షణానైనా సీఎం నివాసాన్ని ముట్టడించే అవకాశం ఉండటంతో సీఎం రేవంత్ నివాసం వద్ద పోలీసులు భద్రత పెంచారు. సీఎం ఇంటికి వెళ్లే మూడు దారుల్లోనూ పోలీసులు అడుగడుగునా భద్రతా కట్టుదిట్టం చేశారు. మరోవైపు హైదరాబాద్ లోని మినిస్టర్ క్వార్టర్స్ వద్ద బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. కేసీఆర్ సిట్ విచారణను నిరసిస్తూ.. బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నేతలు నల్ల జెండాలతో మినిస్టర్ క్వార్టర్స్ ను ముట్టడించి సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అక్కడే ధర్నాకు దిగారు. ఆ ప్రాంతంలో భారీగా మోహరించిన పోలీసులు.. బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్, తుంగ బాలును అరెస్ట్ చేశారు. మినిస్టర్ క్వార్టర్స్ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించిన విద్యార్థి నాయకుల్ని అడ్డుకున్నారు. మరోవైపు కేసీఆర్ సిట్ విచారణ నేపథ్యంలో ఆయన ఇంటి చుట్టూ పోలీసులు నాలుగంచెల భద్రతను ఏర్పాటు చేశారు. ఐదుగురు డీసీపీలు బందోబస్త్ నిర్వహించారు. ఆ చుట్టు పక్కల ప్రాంతాలకు బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు బీఆర్ఎస్ పిలుపునివ్వడంతో నేతలు, కార్యకర్తలు బైక్ ర్యాలీలు నిర్వహించి నిరసనలు వ్యక్తం చేశారు. మరోవైపు హైదరాబాద్‌లోని సెక్రటేరియట్ ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మ దహనం చేశారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు బొమ్మకు అంటుకున్న మంటలను ఆర్పారు. పలువురు బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకున్నారు. దీంతో సచివాలయం పరిసరాల్లో ఉద్రిక్తత చోటుచేసుకుంది.

# వికసిత్ భారత్ దిశగా కేంద్ర బడ్జెట్

**మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్**

**ప్రజారంజక విషయాలపై కేంద్రం దృష్టి**



ప్రధానమంత్రి నరేంద్ర మోడి నాయకత్వంలో భారత్‌లో సుస్థిరమైన ప్రభుత్వ నడుస్తోందని మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ వెల్లడించారు. దూరదృష్టితో ఆయన తీసుకుంటోన్న దీర్ఘకాలిక నిర్ణయాలతో భారత జీడీపీ ఏడు శాతం పెరిగిందన్నారు. గతేడాది రూ. 50 లక్షల కోట్లు బడ్జెట్ ప్రవేశ పెడితే ఈ ఏడాది రూ. 53 లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టారని తెలిపారు. బడ్జెట్‌లో అనేక ప్రజారంజక విషయాలపై మోడి.. దృష్టి పెట్టారని వివరించారు. ఆదివారం పార్లమెంట్ ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్రం ప్రకటించిన బడ్జెట్... వికసిత భారత్ 2047 వైపు ప్రయాణానికి స్పష్టమైన మార్గ నిర్దేశం చేసిందని చెప్పారు. కోట్ల మంది ఆధారపడి ఉన్న సర్వీస్ సెక్టార్ మీద మొట్టమొదటిసారిగా దృష్టి పెట్టి దానిని ప్రోత్సహించే ప్రయత్నం చేసిందన్నారు. ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు మినరల్ హబ్ గా తయారికీ ప్రత్యేక కారిడార్ ప్రకటించారని పేర్కొన్నారు. గౌతమ బుద్ధుడు నడయాడిన నార్త్ ఈస్ట్ స్టేట్స్‌లో టూరిజం డెవలప్మెంట్ చేయడానికి ప్రణాళికలను ఈ బడ్జెట్ ఇచ్చిందని వెల్లడించారు. బ్యాంకింగ్ రంగం నుంచి అప్పులు ఎక్కువగా ఇచ్చేందుకు ఏం చేయాలి అనే దాని మీద చాలా సునిశితమైన దృష్టితో ఈ బడ్జెట్ ప్రతిపాదన జరిగిందన్నారు. హైదరాబాద్ కేంద్రంగా స్పీడ్ రైలు ప్రాజెక్టు తెలంగాణ అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. మొత్తంగా పేదలకు, యువతకు, విద్యార్థులకు బడ్జెట్‌లో పెద్ద పీట వేశారని స్పష్టం చేశారు. స్టార్ట్ అప్స్‌ను ప్రోత్సహించేలా బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇచ్చారని, దేశ ప్రజల హితమే ధ్యేయంగా బడ్జెట్ ఉందని ఈటల రాజేందర్ హర్షం వ్యక్తం చేశారు.గంభీరంగా ఉన్న నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి గత బడ్జెట్ లో నాలుగు లక్షల కోట్లు పెట్టినట్లు వివరించారు. మేకింగ్ ఇండియా మేడిన్ ఇండియా అనుగుణంగా యువశక్తి దేశ పురోగమనంలో భాగస్వాములు చేయాలని లక్ష్యంతో బడ్జెట్ పెట్టారని వ్యాఖ్యానించారు. మరోవైపు... దేశంలో అనేక మందులపై ఉన్న ఇంపోర్ట్ టాక్స్ తగ్గించారన్నారు. క్యాన్సర్‌తో పాటు 17 రకాల మందుల మీద పన్ను రాయితీ ఇచ్చి పేద రోగులకు ఉపశమనం కల్పించారని చెప్పారు. ప్రతి జిల్లా కేంద్రంలో ట్రామా కేర్ సెంటర్ పెట్టాలని నిర్ణయించినట్లు చెప్పారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి పథకానికి పేరు మారిస్తే.. ప్రతిపక్షాలు ఆ పథకమే తీసేస్తున్నట్లుగా దుష్ప్రచారం చేశాయన్నారు. కానీ గత బడ్జెట్లో రూ. 81 వేల కోట్లు బడ్జెట్ పెడితే ఈ సారి రూ. లక్షా యాభై వేల కోట్ల పై చిలుకు పెట్టారని స్పష్టం చేశారు. గ్రామీణ పేదలకు మరింత ఉపాధి కల్పిస్తున్నారని అన్నారు. దేశ భవిష్యత్తు క్యాపిటల్ ఎక్స్పెండిచర్ మీద ఆధారపడి ఉంటుందన్న ఈటల... గతేడాది రూ. 11 లక్షల కోట్లు పెడితే ఈ సారి రూ.12 లక్షల కోట్ల పెట్టారని అన్నారు. ఈ బడ్జెట్ లో ఎక్కువ మాన్ పవర్ కోసం నిధులు కేటాయించి.. లక్షలాదిమంది ఆధారపడి ఉన్న చేనేత రంగానికి ప్రోత్సాహం ఇచ్చారని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న డైరీ పౌల్ట్రీ వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలకు పెద్దపీట వేసింది అనడానికి బడ్జెట్ స్పీచ్ సజీవ సాక్ష్యం అన్నారు. ఇతర దేశాల నుంచి దిగుమతులు తగ్గించి స్వదేశీ ఉత్పత్తులు పెంచడం కోసం అనేక పథకాలను ఈ బడ్జెట్లో ప్రవేశపెట్టారని తెలిపారు.

## తెలంగాణకు రిక్తహస్తం

**8 మంది బీజేపీ ఎంపీలు నిధులు రాబట్టలేకపోయారు**

**సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ**



: కేంద్ర ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో తెలంగాణకు మొండిచేయ్యి లభించిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 8మంది బీజేపీ ఎంపీలు, మంత్రులు ఉన్నప్పకీ రాష్ట్రానికి రావాల్సిన నిధులు రాబట్టడంలో విఫలమయ్యారని ఆరోపించారు. కేంద్ర బడ్జెట్ దేశాభివృద్ధి, రాష్ట్ర ప్రయోజనాలకు ఏమాత్రం ఉపయోగపడేలా లేదని వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుత బడ్జెట్ తో కేంద్ర ప్రభుత్వం రూ.14 లక్షల కోట్లు అప్పులు, వడ్డీలు కట్టాల్సి వస్తున్నదని తెలిపారు. పని దినాలు పెంచామని చెప్పినప్పటికీ 'వీబి జిరాంజి' పథకానికి కేవలం రూ.93 వేల కోట్లు కేటాయించి గతంతో పోలిస్తే కోత పెట్టారని విమర్శించారు. వ్యవసాయ రంగానికి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల సంక్షేమానికి నిధులు తగ్గించారని, ఈ రంగాలకు గతంలో కేటాయించిన నిధులు పూర్తిగా ఖర్చు చేయలేదన్నారు. దేశ కార్పొరేట్ సంస్థలైన ఆదానీ, అంబానీ తదితరులకు డేటా సెంటర్ల పేరుతో రాయితీలు ప్రకటించారని, సంక్షేమ పథకాలు, ఎరువుల రాయితీలు, చిన్న పరిశ్రమలకు ఎలాంటి రాయితీలు ప్రకటించలేదు. ఉద్యోగులకు ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని పెంచకుండా నిరాశపర్చిందన్నారు. తెలంగాణ రాష్ట్రానికి వాటాగా రావాల్సిన నిధులు తగ్గించారని, పన్నుల వాటాలో 2.11 శాతం ప్రకారం రూ.63 వేల కోట్లు రావాల్సిందని, గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.4 వేల కోట్లు మాత్రమే ఇచ్చారని గుర్తుచేశారు. జీఎస్టీ పన్నుల వల్ల ఇప్పటికే రాష్ట్రాలు ఆర్థికంగా సతమతమవుతుంటే పన్నుల వాటాను తగ్గించడం శోచనీయమన్నారు. పాలమూరు, రంగారెడ్డి సాగునీటి ప్రాజెక్టులకు జాతీయ హోదా యివ్వాలని కోరుతున్నా వాటి ఊసే లేదన్నారు. హైదరాబాదు మెట్రో రైల్‌ను విస్తరణకు నిధులు ఇవ్వలేదని, ఫార్మా రంగానికి అవసరమైన నిధులు కేటాయించలేదని, విద్యా, వైద్య రంగాలు పూర్తిగా కార్పొరేట్ మయమవుతున్న పరిస్థితుల్లో పేదలకు ఆ రంగాలు అందుబాటులోకి తేవడానికి తగినన్ని నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

## బీఆర్ఎస్ అరాచక పాలనపై విచారణ

**టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**



బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన అరాచకంపై విచారణలు జరుగుతున్నాయని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. గత ప్రభుత్వ పాలనలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ ఘోరమైన నేరమన్న ఆయన అందులో ప్రమేయం ఉన్న నేతలే విచారణకు హాజరు అవుతున్నారని చెప్పారు. కేటీఆర్, హరీష్ రావు, సంతోష్ రావు మాదిరి కేసీఆర్ కూడా సిట్ ఎదుట హాజరు అవుతున్నారు. కానీ బీఆర్ఎస్ నేతలు ఎందుకు హడావిడి చేస్తున్నారో తెలియడం లేదని ఎద్దేవా చేశారు. ఆదివారం ఫోన్ ట్యాపింగ్ కేసు వ్యవహారంలో సిట్ విచారణకు కేసీఆర్ హాజరవుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ నిరసనలపై ఆయన స్పందించారు. ఈ మేరకు హైదరాబాద్ లో మీడియాతో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ కేసు లో సిట్ విచారణకు కేసీఆర్ హాజరవుతున్న వేళ బీఆర్ఎస్ నేతలు అతిఉత్సాహం ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ విచారణను భూతద్దంలో చూడటం హాస్యాస్పదమన్నారు. కేసీఆర్ నీతిమంతుడనీ, అన్యాయమనీ అనడం గగ్గోలు పెట్టడం మరీ తెలివిలేనితనమని విమర్శించారు. కేసీఆర్ రాజరిక పాలనలో ఉన్నామనే భ్రమలో ఉన్నారు. చట్టం ముందు అందరూ సమానులేనన్న మహేశ్ కుమార్ గౌడ్... చట్టం తన పని తాను చేసుకుంటే పోతుంటే నిందలు వేయడం విచారకరమన్నారు. గతంలో శిబూ సోరెన్, మాయావతి, జయలలిత, లాలు ప్రసాద్ యాదవ్, యడ్యూరప్ప లాంటి సీఎంలు కూడా విచారణలు ఎదుర్కొన్నారని మహేశ్ కుమార్ గౌడ్ గుర్తుచేశారు. టెలిగ్రాఫ్ యాక్ట్ ప్రకారం విపత్కర పరిస్థితుల్లో మాత్రమే ఫోన్ ట్యాపింగ్ చేయాలని చెప్పారు. కానీ బీఆర్ఎస్ పాలనలో ఇందుకు భిన్నంగా జరిగిందన్నారు.. పారిశ్రామిక వేత్తలు, సినీతారల ఫోన్ ట్యాప్ చేసి బ్లాక్ మెయిల్ చేశారని ఆరోపించారు.

# జి హెచ్ ఎం సి కార్పొరేటర్ గా బరిలో బలరామ్ యాదవ్..

**– ఎమ్మెల్యే గాంధీ కి అనుచరణ గణంతో వెళ్లి అవకాశం ఇవ్వాలని బలరామ్ యాదవ్ విజ్ఞప్తి..**

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : రాబోయే జి హెచ్ ఎం సి ఎన్నికల్లో గెలుపు గుర్రాల కే ఎన్నికల్లో పోటీచేసే అవకాశం ఉంటుందని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, రాష్ట్ర పి ఎ సి ఛైర్మెన్ అరేకపుడి గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం లోని శ్రీ రామ్ నగర్ ఏ బ్లాక్ సంక్షేమ సంఘం అధ్యక్షులు బలరాం యాదవ్ 200మంది అనుచరులతో కలిసి ఎమ్మెల్యే గాంధీ నీ కలిసి తనకు రాబోయే జి హెచ్ ఎం సి ఎన్నికల్లో శ్రీ రామ్ నగర్ కార్పొరేటర్ గా పోటీచేసే అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీచేసే అవకాశం కాంగ్రెస్ అధిష్టానం చూస్తుందని తాను కేవలం ప్రతిపాదనలు చేసి పంపడం వరకే తన పాత్ర ఉంటుందని అన్నారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ ప్రజలకు సేవచేసే వారికి పార్టీ తప్పకుండ అవకాశం ఇస్తుందని అన్నారు. ఈ సారి ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల సంఖ్య పెరుగుతుందని అన్నారు. ప్రజల్లో పేరు ఉండి గెలిచే అభ్యర్థులకు మాత్రమే పోటీచేసే అవకాశం ఉటుందని వివరించారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ వారికీ అందుబాటు లో ఉన్నవారే గెలిచే ఎక్కువ అవకాశం ఉంటుందని అన్నారు. నేను ఇస్తామని చెప్పిన అధిష్టానం ఒప్పుకోదని వారుకూడా శాస్త్రీయంగా వారి సర్వేలో ఎవరూ విజయం సాధిస్తారో వారికే అవకాశం కల్పిస్తుందని వివరించారు. పని చేయండి ప్రజలకు అందుబాటుల్లో ఉంటూ వారి కష్టసుఖాల్లో భాగస్వాములై ప్రజా సేవకు అంకితం కావాలని బలరాం యాదవ్ కు సూచించారు. జి హెచ్ ఎం సి లో డివిజన్లు పెరిగే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఎన్నికలు మరో 6 నెలల సమయం ఉందని తెలిపారు. పార్టీ అన్ని విషయాలు పరిగణలోకి తీసుకోని గెలుపు గుర్రాలకే జి హెచ్ ఎం సి ఎన్నికల్లో పోటీచేసే అవకాశం కల్పిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బలరాం యాదవ్ అనుచరులు సుమారు 200 మంది అభిమానులతో



శ్రీరామ్ నగర్ బ్లాక్ నుంచి భారీ కన్వాయ్ తో ఎమ్మెల్యే స్వగృహానికి తరలివెల్లారు. దారిపోడవున బలరాం యాదవ్ కు అనుకూలంగా నినాదాలు చేస్తూ అనునాయులు ఎమ్మెల్యే గాంధీ ని కలసి బలరాం యాదవ్ కు కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ గా అవకాశం కల్పించేలా సిఫారసు చేసే భాధ్యత మీరు తీసుకోవాలి గెలిపించుకుని తీసుకు వచ్చే బాధ్యత మాది అని తెలియజేశారు.

# జీడిపల్లి గ్రామంలో మహిళా శక్తి ఉత్సవం

**– సైనికుల మాతృమూర్తులకు ఘన సన్మానం**



కల్వకుర్తి ఫిబ్రవరి 1 వార్త మిర్రర్ ప్రతినిధి:–కల్వకుర్తి శ్రీ సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాల వారు మాతృమండలి ఆధ్వర్యంలో జీడిపల్లి గ్రామంలో సప్తశక్తి సంఘం కార్యక్రమాన్ని గ్రామ0లో రైతు వేదిక వద్ద ఈ ఉత్సవ ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళల ఆత్మవిశ్వాసం,కుటుంబ నిర్మాణంలో వారి పాత్ర, సమాజ అభివృద్ధిలో స్త్రీ శక్తి ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షురాలిగా పోలేపల్లి ప్రత్యూష (సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్) హాజరై మాట్లాడుతూ... మహిళలు విద్య, క్రమశిక్షణ, ఆత్మస్థైర్యంతో ముందుకు సాగితే కుటుంబంతో పాటు సమాజం బలోపేతం అవుతుందని అన్నారు. స్త్రీ శక్తిని గుర్తించి ప్రోత్సహించినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.ముఖ్య వక్తలుగా నిర్మల మరియు సంధ్య స్త్రీలోని సప్తశక్తులు, కుటుంబ ప్రబోధన ప్రాముఖ్యత పై సవివరంగా తెలియజేశారు. కుటుంబ విలువలు, సంస్కారం, నైతికత పెంపొందించడంలో మాతృమూర్తుల పాత్ర అత్యంత కీలకమని,పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో తల్లులే మూలాధారమని అన్నారు. అనంతరం జీడిపల్లి గ్రామం నుంచి దేశసేవకు అంకితమైన సైనికులను తీర్చిదిద్దిన మాతృమూర్తులను ఘనంగా సన్మానించారు. ఈ ఉత్సవం లో ఈ సన్మానం కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సైనికుల త్యాగానికి వెనుక ఉన్న తల్లుల సేవలు అపారమైనవని వక్తలు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు, మాతాజీలు, జీడిపల్లి గ్రామానికి చెందిన అనేక మంది మాతృమూర్తులు పాల్గొన్నారు.

### దివ్య ఎంటర్ ప్రైజెస్, ఎం ఆర్ కె హోమ్

# ఇంటీ రియర్స్ ప్రారంభోత్సవం..

**– ప్రారంభించిన సీనియర్ నాయకులు ముప్వ సత్యనారాయణ, ప్రసాద్స్ ఫౌండేషన్ చైర్మన్ లయన్ డి ఎస్ ఆర్ కె ప్రసాద్..**



శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : మదినగూడలో ప్రసాద్స్ ఫౌండేషన్ సభ్యులు ఎం ఆర్ కే చౌదరి నూతన వ్యాపార సంస్థ దివ్య ఎంటర్ ప్రైజెస్, ఎం ఆర్ కె హోమ్ ఇంటీ రియర్స్ ను రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముప్వ సత్యనారాయణ చేతులమీదుగా ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్స్ ఫౌండేషన్ చైర్మన్ లయన్ డి ఎస్ ఆర్ కె ప్రసాద్ పాల్గొని ఎం.ఆర్.కే చౌదరి కి శుభాకాంక్షలు తెలియజేస్తూ అభివృద్ధిలోకి సంస్థ ఎదిగి ఆర్థిక పరంగా పరిపుష్టం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యు. సాంబశివ రావు, వెంకట్రావ్, రావలా శ్రీనివాస్ చౌదరి, శ్రీకాంత్ చౌదరి, పెద్ద బాబు చౌదరి, భాస్కర్, ప్రసన్న, దివ్య, ఎం. జనిత్ చౌదరి, మోక్షిత, సన్నిత తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ గుట్ట వెంకటేశ్వర స్వామి జాతర మహోత్సవం



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఫిబ్రవరి 1 జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని ఇటిక్యాల గ్రామా శివారులోని అడవిలో గల గుట్టలో స్వయంభువుగా వెలసిన శ్రీ గుట్ట వెంకటేశ్వర స్వామి జాతర మహోత్సవాన్ని ప్రతి సంవత్సరం మాఘ శుద్ధ పౌర్ణమి సందర్భంగా ఆదివారం రోజున గ్రామస్తులు ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. రేగుంట సాతారం, రామారావు పల్లె, గుండంపల్లి ,గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.. చిన్న పెద్ద లేకుండా అందరూ గుట్ట పైకి వెళ్లి స్వామివారిని దర్శనం చేసుకున్నారు.. అనంతరం భక్తులకు అన్నదానము నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నీరటి శ్రీనివాస్, ఉప సర్పంచ్ నాగిరెడ్డి సాయిరెడ్డి, గ్రామ సేవా సమితి అధ్యక్షులు అనుపురం చిన్న లింబాద్రి గౌడ్, మాజీ సర్పంచ్లు మరిపెల్లి నారాయణ గౌడ్, సామల్ల లావణ్య వేణు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, నాయకులు మోర హనుమాన్లు, ఏనుగు మల్లారెడ్డి, కాటిపెల్లి గంగారెడ్డి, కొమ్ముల ఆదిరెడ్డి, మిట్టపల్లి రాంరెడ్డి, మద్రిపెల్లి శ్రీనివాస్ గౌడ్, కొప్పెల మైపతి రెడ్డి, పుట్టుకం రాజారెడ్డి, ఓరగంటి లక్ష్మణ్, నాగిరెడ్డి నర్సారెడ్డి, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ పై రాజకీయ కక్షతోనే సిట్ విచారణ

**– గోలి శ్రీనివాసరెడ్డి**



కల్వకుర్తి ఫిబ్రవరి 1 వార్త మిర్రర్ ప్రతినిధి:–సిట్ విచారణ పేరిట బీఆర్ఎస్ అధినేత మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్)ను వేధించడం అప్రజాస్వామికమని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. తెలంగాణ సాధించిన నాయకుడి పై రాజకీయ కక్షతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చర్యలకు దిగుతోందని ఆరోపించారు. కేసీఆర్ సిట్ విచారణ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు నిరసనలు చేస్తున్నారని తెలిపారు. వెల్దండ మండల కేంద్రంలో జరిగిన పత్రిక సమావేశం లో ఆయన మాట్లాడుతూ..ఇది కేసీఆర్ వ్యక్తిగత అంశం కాదని, తెలంగాణ ఆత్మగౌరవానికి సంబంధించిన పోరాటమని అన్నారు. కేసీఆర్ పై అన్యాయగా చర్యలు కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలకు సిద్ధమని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు.

# శిల్పారామం లో అలరించినా వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు



మాదాపూర్ వార్త మిర్రర్ : మాదాపూర్ లో నీ శిల్పారామం లో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం యునైటెడ్ స్టేట్స్ నుండి విచ్చేసిన కూచిపూడి కళాకారిణి కుమారి వృందా పూటుకూరి తన కూచిపూడి ప్రదర్శనలో శ్రీ గణపతిం, అలిమేలు మంగ, కొలువై ఉన్నాడే అంశాలను ప్రదర్శించి మెప్పించారు. శ్రీమతి దుర్గేష్ నందిని శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలో జయము జయము, వినాయక కౌతం, సాధించెనే ఓ శారదా భుజంగం, మరకత, అష్టపది, నిర్వాణం శతకం అంశాలను సంయుక్త, అద్వైత, భవజ్ఞ, గీతికా, సాహితి, మహి వర్ణిక, హెష్ణ, ఏష, స్వాతి, అంజనీ, జయ, సాధికా, శాన్వి మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.

# గిరి ప్రదక్షిణ, జైశ్రీరామ్ నినాదాలతో మారుమ్రోగిన శ్రీ కొండగట్టు, పులకించిన భక్తుల హృదయాలు...



వార్త మిర్రర్ మల్యాల ప్రతినిధి (ఫిబ్రవరి 1): మాఘ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి సన్నిధానం భక్తుల సందడితో కిటకిటలాడింది. స్వామివారి దివ్య అనుగ్రహాన్ని పొందాలనే ఆకాంక్షతో వేలాది మంది భక్తులు గిరి ప్రదక్షిణకు తరలివచ్చి జై శ్రీరామ్, జై ఆంజనేయ స్వామి నినాదాలతో కొండగట్టును మారుమ్రోగించారు. గత మూడు సంవత్సరాల ఒక నెల క్రితం ప్రతీ పౌర్ణమి రోజున గిరి ప్రదక్షిణ చేయాలని శ్రీ సురేష్ ఆత్మరామ్ మహారాజ్ సంకల్పించగా, అప్పటి నుంచి నిరాటంకంగా ఈ పవిత్ర సంప్రదాయం కొనసాగుతోందని భక్తులు తెలిపారు. ఫిబ్రవరి--01 ఆదివారం మాఘమాస పౌర్ణమి సందర్భంగా నిర్వహించిన సుమారు 37వ గిరి ప్రదక్షిణలో భక్తులు తండోపతండాలుగా పాల్గొని తమ మొక్కులు తీర్చుకున్నారు. సుమారు 8--9 కిలోమీటర్ల పొడవు గల ఈ గిరి ప్రదక్షిణ మార్గం భక్తులకు అపూర్వమైన ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించింది. అడుగడుగునా రామనామ స్మరణ, భక్తి గీతాలు, హనుమాన్ చాలీసా పఠనాలతో వాతావరణం పూర్తిగా భక్తిరసమయంగా మారింది. స్వామివారి దయవలన ఈ గిరి ప్రదక్షిణ విజయవంతంగా పూర్తవుతుందని భక్తులు విశ్వాసం వ్యక్తం చేశారు. అయితే భవిష్యత్తులో గిరి ప్రదక్షిణకు వచ్చే భక్తుల సౌకర్యార్థం మూత్రశాలలు, స్వచ్ఛమైన త్రాగునీటి వసతి, మెరుగైన రోడ్డు మార్గం వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని భక్తులు కోరారు. శ్రీ కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామివారి ఆశీస్సులతో ఈ గిరి ప్రదక్షిణ భక్తులకు మనశ్శాంతి, ఆధ్యాత్మిక ఉత్తేజం కలిగించిందని, స్వామివారి కృపతో అందరి కోరికలు నెరవేరాలని భక్తులు ఆకాంక్షించారు.



# కుట్రలు కుతంత్రాలతో కేసీఆర్ చరిత్ర ను చేరపలేరు.. బి ఆర్ ఎస్ పార్టీ శ్రేణులు..



శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : తెలంగాణ తొలి ముఖ్యమంత్రివర్యులు కేసీఆర్ కి సిట్ నోటీసుల పేరుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గపు, అరాచక చర్యలకు వ్యతిరేకంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని మక్త మహబూబ్ పేట్ లో భారీ నిరసన కార్యక్రమం చేపట్టిన బీఆర్ఎస్ శ్రేణులు కుట్రలు, కుతంత్రాలతో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కేసీఆర్ ను అప్రదిష్ట పాలు చేసే కార్యక్రమాలను ప్రజలు గమనిస్తున్నారు అని వాటిని తిప్పికొట్టడానికి బి ఆర్ ఎస్ పార్టీ శ్రేణులు సన్నద్ధం అయ్యాయి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తౌట్ రెడ్డి సంతోష్ రెడ్డి, బిఎస్ఎన్ కిరణ్ యాదవ్, రోజా, గోపరాజు శ్రీనివాసరావు, వాలా హరీష్, పార్నంది శ్రీకాంత్, నర్సింగరావు, సురేష్ గౌడ్, రాజు ముదిరాజ్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

### తాజ్ పూర్ లో బిఆర్ఎస్ పార్టీ

# ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం

**– రేవంత్ రెడ్డి ది డైవర్షన్ పాలిటిక్స్ – డాక్టర్ ర్యాకల శ్రీనివాస్**



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి భువనగిరి మండలం రాజ్ పూర్ గ్రామంలో ఫోన్ టాపింగ్ కేసు విచారణ కుట్రపూరితంగా సిట్ నోటీస్ కేసీఆర్ పై ఇచ్చినందుకు బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే పైళ్ళ శేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు, బిఆర్ఎస్ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు, ఈ సందర్భంగా డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల హామీలు అమలు చేయడం చేతకాకనే నోటీసుల పేరుతో రేవంత్ రెడ్డి కాలయాపన చేస్తుందని అన్నారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# పౌర్ణమి పర్వదినం పురస్కరించు సూర్య ధన్వంతరి దేవాలయములో కొని ప్రత్యేక పల్లకి సేవ..



వార్త మిర్రర్ జగిత్యాల ప్రతినిధి ఫిబ్రవరి 1 ఆదివారం భానువాసరే మాఘ మాసం శుక్ల పక్షం పౌర్ణమి పర్వదినం సందర్భంగా శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయములో ప్రత్యేక పల్లకి సేవ సూర్య భగవానుని విశిష్టత :ఆదివారం -- సూర్య భగవానుని ప్రత్యేక దినం ఆదివారం హిందూ సాంప్రదాయంలో సూర్య భగవానుని (సూర్యుని)కి అంకితమైన పవిత్రమైన రోజు. ఈ రోజు సూర్యదేవుని ఆరాధించడం వల్ల ఆరోగ్యము, ఆయుష్మానుభవం, విజయం, ధనం, మరియు ప్రసిద్ధి లభిస్తాయని విశ్వాసం ఉంది. తదియ పర్వదినం పురస్కరించుకొని జగిత్యాల పట్టణం లోని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయములో శ్రీ సూర్య భగ వానుకి, ప్రత్యేక పూజల అనంతరం ప్రత్యేక పల్లకి సేవ నిర్వహించడం జరిగినది. తదనంతరం అమ్మత నిర్గుండి కశాయం ఉచిత వితరణ చేయడం జరిగినది. తదనంతరం సూర్య భగవాన్ కు భక్తులు ముడుపులు కట్టారు. ఇట్టి కార్యక్రమములో సత్సంగ సంధాన కర్తలు పెద్ది శ్రీనివాస్, భారతాల రాజసాగర్, ఎలిమిళ్ల సత్యనారాయణ, బీరెల్లి సత్యనారాయణ, ప్రవీణ్, విజయకుమార్, వేల్పుల స్వామి, సదాశివ్, తిరుపతి, మాతలు, భక్తులు, అర్చకులు శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

# భువనగిరి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులుగా పాశం శివానంద్ ఏకగ్రీవఎన్నిక



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి భువనగిరి మండల సర్పంచ్ల సమావేశం భువనగిరి పట్టణ కేంద్రంలో ఎస్ ఎల్ ఎన్ ఎస్ ఫంక్షన్ హాల్లో జరిగింది ఈ సందర్భంగా సర్పంచుల ఫోరం భువనగిరి మండల అధ్యక్షులుగా కోనూరు సర్పంచ్ పాశం శివానంద్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పూర్తి కమిటీ వివరాలు ఉపాధ్యక్షులు రాంపల్లి కృష్ణ, కేతావత్ నరేందర్, ప్రధాన కార్యదర్శి పన్నాల మల్లికార్జున్ రెడ్డి, భూక్య సునీత, కార్యదర్శి చిన్న బత్తిని శరయ్య, సహాయ కార్యదర్శి కలను రవికల, కోశాధికారి పల్లెపాటి నాగరాణి, కార్యవర్గ సభ్యులు సుమలత, హేమంత్, సురేష్, నాగపురి సువర్ణ, తోటకూర మానస, భూషణ బోయిన గీత తదితరులు నూతన కమిటీలో నియమించబడ్డారు

# రాయికల్ పట్టణ, మండల గ్రామాలలో బీఆర్ఎస్ పార్టి నిరసన

**– సీఎం దిష్టి బొమ్మ దహనం**

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఫిబ్రవరి 1 కేసీఆర్ పై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న రాజకీయ వేధింపులకు నిరసనగా జగిత్యాల జిల్లా రాయికల్ మండల, పట్టణ శాఖ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. మండలలోని రామాజీపేట , ఇటిక్యాల, కట్కాపూర్, చింతలూరు, మూటపల్లి, కొత్తపేట, సింగారావుపేట్ మిగతా అన్ని గ్రామాలలో నిరసన కార్యక్రమాలు నిర్వహించి, సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రాయికల్ మండల అధ్యక్షులు బర్కం మల్లేష్ మాట్లాడుతూ...కేసీఆర్ ని సిట్ విచారణకు పిలవడం అనేది పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న రాజకీయ కక్ష సాధింపు చర్య అని తీవ్రంగా ఖండించారు. తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలిపిన కేసీఆర్ ప్రజాదరణను తట్టుకోలేకే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి నిరంకుశ, ప్రతీకార రాజకీయాలకు పాల్పడుతోందన్నారు. ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఎన్నికల్లో ఎదురైన పరాభవాన్ని కప్పిపుచ్చుకోవడానికి బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు, నోటీసులతో భయభ్రాంతులకు గురి చేస్తోందని విమర్శించారు. ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, అధికార దుర్వినియోగానికి పరాకాష్ట అని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ పాలనకు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు నిరంతరం పోరాటం చేస్తాయని హెచ్చరించారు. కేసీఆర్ పై జరుగుతున్న రాజకీయ వేధింపులను తెలంగాణ ప్రజలు ఎప్పటికీ క్షమించరని, తగిన సమయంలో కాంగ్రెస్‌కు గట్టి బుద్ధి



చెబుతారని స్పష్టం చేశారు..ఈ నిరసన కార్యక్రమంలో భారీ సంఖ్యలో మండల గ్రామాల అధ్యక్షులు, పట్టణ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు.

# దేవరకొండ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో అమానవీయం

- కుక్క కాటు బాధితులకు తప్పని తిప్పలు
- ఏరియా ఆసుపత్రిలో కుక్క కాటు ఇంజెక్షన్లు ఇతర అత్యవసర మందులు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి
- పేదలకు అండగా ఉండాల్సిన ఏరియా ఆసుపత్రిలో ఇలాంటి దుస్థితి నెలకొనడంపై సర్వత్రా విమర్శలు

దేవరకొండ ఫిబ్రవరి 01 వార్త మిర్రర్: దేవరకొండ పట్టణంలోని మూడవ వార్డు శాలిబండ పరిధిలో గల అంజయ్య వెంచర్ వెళ్లే దారిలో పిచ్చి కుక్క బీభత్సం సృష్టించింది. తండ్రీకొడుకులపై ఒక్కసారిగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ దాడిలో మొహమ్మద్ అబ్దుల్ గఫార్ (30), ఆయన కుమారుడు మొహమ్మద్ జహీద్ (7) తీవ్రంగా గాయపడ్డారు. ఆదివారం కుక్క కాటుకు గురైన బాధితులను కుటుంబ సభ్యులు హుటాహుటిన చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే ఆసుపత్రికి వెళ్లిన బాధితులకు అక్కడి సిబ్బంది తీరుతో కోలుకోలేని షాక్ తగిలింది. ?బాధితులు ఆసుపత్రికి చేరుకున్న సమయంలో విధుల్లో ఉండాల్సిన డాక్టర్ అందుబాటులో లేకపోవడం గమనార్హం. అక్కడ ఉన్న నర్సులను సంప్రదించగా ఆసుపత్రిలో కుక్క కాటుకు సంబంధించిన ఇంజెక్షన్లు (యాంటీ రేబిస్ వ్యాక్సిన్) అందుబాటులో లేవని, పైగా మందుల సరఫరా కూడా నిలిచిపోయిందని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. ఇక్కడ వైద్యం సాధ్యం కాదని ప్రాణాలు కాపాడుకోవాలంటే వెంటనే నల్గొండ లేదా హైదరాబాద్‌కు వెళ్లాలని బాధితులకు ఉచిత సలహా ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఏడేళ్ల బాలుడు నొప్పితో విలవిలలాడుతున్నా కనీస చికిత్స అందించకుండా పంపేయడంపై స్థానికులు మండిపడుతున్నారు. అత్యవసర సమయంలో మెరుగైన వైద్యం అందించి ప్రాణాలు కాపాడాల్సిన ప్రభుత్వ ఆసుపత్రిలో కనీసం ఇంజెక్షన్లు లేకపోవడంపై బాధితుల కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ?పేదలకు అండగా ఉండాల్సిన ఏరియా ఆసుపత్రిలో ఇలాంటి దుస్థితి నెలకొనడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ఈ విషయంపై తక్షణమే స్పందించి విచారణ చేపట్టాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. దేవరకొండ ఏరియా ఆసుపత్రిలో కుక్క కాటు ఇంజెక్షన్లు మరియు ఇతర అత్యవసర మందులు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.




## ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలమై... ప్రతిపక్షాలను వేధిస్తున్న కాంగ్రెస్ సర్కార్

**– మాజీ కార్పొరేటర్ ఏనుగుల అనిల్ యాదవ్**




బాలాపూర్, వార్త మిర్రర్ తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమై, ఇప్పుడు ప్రతిపక్షాలను వేధించే రాజకీయాలకు పాల్పడుతోందని మీర్ పేట మాజీ కార్పొరేటర్ ఎనుగుల అనిల్ కుమార్ యాదవ్ విమర్శించారు. ప్రతిపక్ష నేతలకు నోటీసులు జారీ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ కక్షసాధింపులకు నిదర్శనమని అన్నారు. ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చింది రాష్ట్ర అభివృద్ధి కోసమని, కానీ ప్రభుత్వం హామీల అమలుపై దృష్టి పెట్టకుండా, గత పాలనపై ఆరోపణలు చేస్తూ కాలం గడుపుతోందన్నారు. రైతులకు రుణమాఫీ అమలు కాలేదు, యువతకు ఉద్యోగాలు లేవు, మహిళలకు ఇచ్చిన హామీలు కూడా అమలుకు నోచుకోలేదన్నారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రతిపక్ష నేతలపై నోటీసులు జారీ చేసి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని ఎనుగుల అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా, కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా, మాజీ మంత్రి సబిత ఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు జిహెచ్ఎంసి 60వ డివిజన్ మీర్ పేట్ లో ఎనుగుల అనిల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నాయకులు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బొమ్మను దహనం చేస్తూ తీవ్ర నిరసన కార్యక్రమం నిర వ్రహించారు. రేవంత్ రెడ్డి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేసిన నాయకత్వంపై రాజకీయ కక్షతో చర్యలు తీసుకోవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధని మండి పడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విధానాన్ని తక్షణమే విరమించుకోవాలని, బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి, కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూనే ఉంటుందని అనిల్ యాదవ్ అన్నారు. అవసరమైతే ప్రజా ఉద్యమాలకు కూడా సిద్ధంగా ఉ ంటుందని తెలిపారు. ఈకార్యక్రమంలో కర్మన్ ఘట్ హనుమాన్ టెంపుల్ మాజీ డైరెక్టర్ మేకల యాదగిరి, మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంటెస్టెడ్ కార్పో రెటర్లు దయానంద్ ముదిరాజ్, అబ్బన మోని గోపి యాదవ్, బుచ్చిరెడ్డి రవీందర్ రెడ్డి జిల్లెలగూడ శ్రీ మత్స్య వెంకటేశ్వర స్వామి దేవాలయం మాజీ డైరెక్టర్లు సుర్విలత శేఖర్ గౌడ్, జ్ఞానేశ్వర్ చారి, బీ ఆర్ ఎస్ పార్టీ సోషల్ మిడియా ఇంచార్జి దండు మహేందర్, కాంటెస్టెడ్ కార్పొరేటర్లు ప్యాట నరసింహ , హాథిరాం నాయక్ , జిల్లెలగూడ కాంటెస్టెడ్ ఎంపీటీసీ కర్రె వెంకటేష్ కురుమ , బీ ఆర్ ఎస్ పార్టీ సినియర్ నాయకులు ఉద్యమకారుడు ఐతరాజు వెంకటేశ్, నాయకులు శక్తినగర్ సత్యం, తోలుసూరి నరసింహ యాదవ్, దుంపల ప్రభాకర్, భూతరాజు చందు పాల్గొన్నారు.

## కేసీఆర్ సిట్ విచారణ వేళ బీఆర్ఎస్ నేత హరిపై హౌస్ అరెస్ట్



సికింద్రాబాద్, వార్త మిర్రర్ ఫిబ్రవరి 1 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సిట్ విచారణ సందర్భంగా తార్నాక డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆలకుంట సరస్వతి హరి ని వారి ఇంట్లోనే హరిని ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు హౌస్ అరెస్ట్ చేసి బయటికి వెళ్లకుండా నిర్బంధించారు. ఈ సందర్భంగా ఆలకుంట సరస్వతి హరి మాట్లాడుతూ, ఇలాంటి నిర్బంధాలు తెలంగాణ ఉద్యమ సమయంలో ఎన్నో చూశామని గుర్తు చేశారు. అయితే నేడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం మళ్లీ ఒకసారి తెలంగాణ ఉద్యమాన్ని గుర్తు చేసేలా వ్యవహరిస్తోందని వ్యాఖ్యానించారు. కేసీఆర్‌పై ఈగ వాలితేనే తెలంగాణ అగ్నిగుండంగా మారుతుందని హెచ్చరించారు. ఎంతమంది సిట్‌లను వేసుకున్నా, ఎన్ని విచారణలు చేసినా చివరకు మిగిలేది “గుండు సున్న” తప్ప మరేమీ దొరకదని ఘాటుగా వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కక్షసాధింపు చర్యలు మానుకుని తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 2.2 కోట్ల ప్రతిభా పురస్కారాలు

**– చదువుకో తెలంగాణ -- శ్రీరామ్ లైఫ్ మిషన్ 10వ క్లాస్ ప్రారంభం**



సికింద్రాబాద్, వార్త మిర్రర్ ఫిబ్రవరి 1 : తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో 'చదువుకో తెలంగాణ -- శ్రీరామ్ లైఫ్ మిషన్ 10వ క్లాస్' అనే మెగా ప్రతిభా పురస్కారాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. భారతదేశంలోనే ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం చేపడుతున్న అతిపెద్ద ప్రోత్సాహక కార్యక్రమంగా ఇది నిలవనుంది. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ప్రముఖ సామాజికవేత్త ప్రొఫెసర్ కోదండరాం జనవరి 31, 2026న ఆవిష్కరించారు. ఈ పథకం ద్వారా మొత్తం రూ. 2.2 కోట్ల వరకు నగదు ప్రోత్సాహకాలు అందజేయనున్నారు. రాష్ట్ర స్థాయి ప్రభుత్వ పాఠశాల టాపర్‌కు రూ.5 లక్షలు, రెండో టాపర్‌కు రూ.3 లక్షలు, ప్రతి జిల్లా టాపర్‌కు రూ.2 లక్షలు, ప్రతి నియోజకవర్గ టాపర్‌కు రూ.1 లక్ష, ప్రతి మండల టాపర్‌కు రూ.10,000 నగదు బహుమతులు అందిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లా పరిషత్, మండల పరిషత్, ఇతర ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో నడుస్తున్న 6,000కు పైగా ప్రభుత్వ పాఠశాలల్లోని సుమారు 3.30 లక్షల మంది 10వ తరగతి విద్యార్థులు పాల్గొనే అవకాశం ఉంది. ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ, విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపడటానికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. వచ్చే రెండు నెలలు విద్యార్థులు కష్టపడి చదివి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ చిట్స్ హైదరాబాద్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ జె. భాస్కర్, డీజీఎంలు ఎన్. మురళి, కె. రాజశేఖర్, ఎల్. వెంకట కృష్ణ, డివిజనల్ మేనేజర్ పీ. సతీష్, సీనియర్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎస్. జస్వంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ భవన్‌కు తరలి వెళ్లిన సికింద్రాబాద్ బీఆర్ఎస్ నేతలు



సికింద్రాబాద్, వార్త మిర్రర్ ఫిబ్రవరి 1 .. బంజారాహిల్స్ నంది నగర్ లోని మాజీ సీఎం కేసీఆర్ నివాసంలో స్థితి విచారణ నేపథ్యంలో తెలంగాణ భవన్‌కు సికింద్రాబాద్ విఆర్ఏ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. యూత్ ఐకాన్ తీగుల్ల రమేశ్వర్ గౌడ్‌తో కలిసి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సునీల్ ముదిరాజ్, కూ రెల్లి నాగరాజు గౌడ్, ఎర్ర నాగు, యాదగిరి, శేఖర్, వేణుగోపాల్ రెడ్డి తదితరులు వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ కక్షతోనే బీఆర్ఎస్ అధినేత కెసిఆర్ ను కాంగ్రెస్ సర్కార్ వేధించడం దుర్మార్గపు చర్య అని ఆరోపించారు.

## వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఆఫీస్ బేరల్స్ ట్రైనింగ్ సెమినార్




దేవరకొండ ఫిబ్రవరి 01 వార్త మిర్రర్ వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో వి 104 ఏ ఆఫీస్ బేరల్స్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ నల్గొండ జిల్లా కేంద్రంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆఫీస్ బేరల్స్ ట్రైనింగ్ సెమినార్ కు ముఖ్యఅతిథిగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ రేణిగుంట్ల శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం దేవరకొండలో 3 కెవి సోలార్ విద్యుత్ ప్యానెల్స్ ను ఉచితంగా ఏర్పాటుచేసిన శివ సాయి మార్కెటింగ్ సోలార్ ఎనర్జీస్ మేనేజింగ్ డైరెక్టర్ బుద్ధ శ్రీనివాస్ గుప్తను ఘనంగా సన్మానించారు. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినందుకు దేవరకొండ వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ వైస్ ట్రెజరర్ నీల సంజీవ్ కుమార్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో బుద్ధ శ్రవణ్ కుమార్ గవర్నర్ వీరెల్లి సతీష్ కుమార్ క్యాబినెట్ సెక్రటరీ నూనె కిషోర్ ఉప్పల విద్యాసాగర్ కోటగిరి రామకృష్ణ మాది గవర్నర్ కమలాకర్ వైస్ గవర్నర్ రాయపూడి భవాని గందే మహేష్ దేవరకొండ వాసవి క్లబ్ అధ్యక్షులు అతుకూరి అంజనేయులు వాసవి వనిత క్లబ్ గ్రేటర్ దేవరకొండ అధ్యక్షురాలు పందిరి జ్యోతి కార్యదర్శి బెజవాడ మల్లేశ్వరి కోశాధికారి ఆలంపల్లి శిరీష వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ ఆలంపల్లి పద్మ రీజన్ చైర్మన్ కొత్త సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

## తారకరామబంజారాకాలనీ లోని పార్కుకు కీ,శే కరంటోత్ లాలు నాయక్ పార్కుగ నామకరణం



హయత్ నగర్ వార్త మిర్రర్ ప్రతినిధి హయత్‌నగర్ డివిజన్ తారకరామ బంజారా కాలనీలోని పార్కుకు కరంటోత్ లాలు నాయక్ పార్కుగ బంజారాకాలనీ అధ్యక్షులు రమావత్ మంగ్యానాయక్ మరియూ కాలనీ పెద్దలు సిలఫలకన్ని ఆవిష్కరించారు ఈ సంధర్బంగా మంగ్యా నాయక్ మాట్లాడుతు మిత్రుడు లాలునాయక్ బంజారాకాలనీ ఏర్పాటుకు చాలాకృషి చేసారని గుర్తుచేసారు ఆయన పేరుకు గుర్తుంపుగా పార్కుకు లాలునాయక్ పేరు పెట్టడం నా చేతులమీదుగా ప్రారంభించడం చాలా సంతోషకరమని అన్నారు ఏదీ ఏమైనా బంజారా కాలనీ చాల కష్టాలతో ఎర్పాటు చేశామని మనం అందరం కలిసి కాలనీ అభివృద్ధికి పాటు పడాలని అంధరం కలిసి మెలిసి ఉండాలని అన్నారు ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు మరియు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# శేరిలింగంపల్లి, కొండాపూర్ ప్రాంతంలో ఇలాంటి అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాల జాతర

- శేరిలింగంపల్లి, కొండాపూర్ లో రెండంతస్తుల అక్రమ వాణిజ్య సముదాయం నిర్మాణం
- చోద్యం చూస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు
- జిహెచ్ఎంసి ఆదాయానికి భారీగా గండి
- టౌన్ ప్లానింగ్ అధికారులపై అవినీతి ఆరోపణలు

హైదరాబాద్, 01 ఫిబ్రవరి గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని శేరిలింగంపల్లి జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అవినీతి అధికారుల మూలంగా జిహెచ్ఎంసి ఆదాయానికి భారీగా గండి పడుతుంది. పెద్ద సంఖ్యలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్న అధికారులు కన్నెత్తి చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అక్రమ నిర్మాణాలు యధాతథంగా కొనసాగుతూ ఉండడంతో టౌన్ ప్లానింగ్ విభాగంలో అవినీతి ఏ మేరకు పేరుకుపోయిందో ఇట్టే అర్థమవుతుంది. జిహెచ్ఎంసి పరిధిలో జరుగుతున్నటువంటి అక్రమ నిర్మాణాలు ఇప్పటికే కొన్ని పూర్తి అవ్వగా, మరికొన్ని వాణిజ్య సముదాయాలు యదేచ్ఛగా నిర్మాణాలు కొనసాగిస్తుండడం ప్రధాన అంశం. శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని కొండాపూర్ ప్రాంతంలోని ప్లాట్ నెంబర్ 93, ఇంటి నెంబర్ 1-51/191/93/ఎన్ ఆర్ యదేచ్ఛగా అక్రమంగా రెండంతస్తుల వాణిజ్య సముదాయం నిర్మాణం పూర్తి కావస్తున్న అధికారులు కన్నెత్తి చూడలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రోడ్డు మార్గంలో వాణిజ్య సముదాయం నిర్మాణంలో ఉండడంతో భవిష్యత్తులో తీవ్రమైనటువంటి ట్రాఫిక్ సమస్య ఏర్పాటుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, జిహెచ్ఎంసి స్పష్టమైన ఆదేశాలతో అక్రమ నిర్మాణాలను ఉ పేక్షించవద్దని స్పష్టమైన ఆదేశాలు ఉ న్నప్పటికీ శేరిలింగంపల్లి టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్మాణం అవుతున్న రెండు అంతస్తుల వాణిజ్య సముదాయం పనులు పూర్తికావస్తున్న కూడా పట్టించు కోకపోవడం అవినీతికి పరాకాష్టగా మారిందని అధికారుల తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వాణిజ్య సముదాయాలో జరుగుతున్నటు వంటి అగ్ని ప్రమాదాలతో ప్రజల ప్రాణాలు పోతున్నప్పటికీ జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్




అధికారులు అక్రమ నిర్మాణాలను నిర్మూలించక పోగా తెర వెనుక ఉండి సహకరిస్తున్నారని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. నెలలకొద్దీ అక్రమ నిర్మాణం యదేచ్ఛగా సాగుతున్నప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోక పోవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. నిర్మాణ దశ నుండి పనులు పూర్తికావస్తున్న నేటి వరకు కూడా అక్రమ నిర్మాణంపై జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు, ఫైర్ సేఫ్టీ అధికారులు, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కన్నెత్తి చూడక పోవడంతో సంబంధిత అధికారులకు ఏ మేరకు ముడుపులు అందాయోనని పలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. భవిష్యత్తులో ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉండాలంటే ఇప్పటికైనా జిహెచ్ఎంసి అధికారులు మొద్దు నిద్రను విడనాడి అక్రమ నిర్మాణంపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## అంబటి రాంబాబు వ్యాఖ్యలతో రాజకీయాల దిగజారుదలకు పరాకాష్ట: వల్లారపు శ్రీనివాస్



సికింద్రాబాద్, వార్త మిర్రర్ ఫిబ్రవరి 1 : తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై వైసీపీ నేత అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలు క్షమించరానివని, రాజకీయాలు ఎంతగా దిగజారిపోయాయో అంబటి మాటలే నిదర్శనమని తెలుగుదేశం పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ వల్లారపు శ్రీనివాస్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. చేసిన పాపానికి సిగ్గుతో తలదించుకోవాల్సింది పోయి, అచ్చోసిన ఆంబోతుల్లా అసత్యాలు ప్రచారం చేస్తూ నాటకాలు ఆడుతున్నారని అంబటి రాంబాబుపై తీవ్ర విమర్శలు గుప్పించారు. హద్దు అదుపులేకుండా నీచమైన భాష, బూతులతో నాయకులను కించపరుస్తూ మాట్లాడడం సభ్యసమాజం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించకూడదన్నారు. వైసీపీ నేతలు మళ్లీ రాష్ట్రంలో బూతుల సంస్కృతిని తెరపైకి తీసుకొచ్చి రాజకీయాలను కలుషితం చేస్తూ గొడవలు సృష్టించేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. గతంలో అసెంబ్లీ సాక్షిగా చంద్రబాబు కుటుంబాన్ని అవమానించిన అంబటి రాంబాబు, నేడు కూడా అదే రీతిలో దుర్భాషలాడుతూ రాజకీయ విలువలను దిగజారుస్తున్నారని అన్నారు. అంబటి రాంబాబును రాజకీయాల నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. గతంలో వైసీపీ నేతలు అసెంబ్లీలో మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన కారణంగా 11 సీట్లకు పరిమితమయ్యారని గుర్తు చేశారు. నేడు అంబటి మాట్లాడిన భాష, రెచ్చగొట్టే తీరు చూస్తే వైసీపీ నేతలు ప్రజాజీవితంలో ఉండేందుకు కూడా అర్హులు కాదని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇటువంటి బూతులు భవిష్యత్తులో ఎవ్వరూ మాట్లాడకుండా అంబటి రాంబాబుపై కేసు నమోదు చేసి సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు వల్లారపు శ్రీనివాస్ కుమార్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, సికింద్రాబాద్ నియోజకవర్గం.